మంగళ వారం
04-04-2023
సంపుటి - 08,
సంచిక - 287
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra Pradesh
CEO & Editor : G. PRUDHVIRAJ
RNI NO: TELTEL/2016/73311
www.samasamajam.in


# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY
తెలుగు దిన పత్రిక

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## టెన్త్ పేపర్ లీక్

### లీకేజీలో ముగ్గురు సస్పెన్షన్







**ఇన్విజిలేటర్ బందెప్ప సహా ముగ్గురిపై వేటు**

**పేపర్ లీకేజీ లేదన్న డిఇవో రేణుక**

**కలెక్టర్‌తో అత్యవసర భేటీ**

**వికారాబాద్, ఏప్రిల్ 3 (సమ సమాజం):** రాష్ట్రంలో టెన్త్ ఎగ్జామ్ పేపర్ లీకేజీల వ్యవహారం కలకలం రేపుతోంది. వికారాబాద్ తాండూరులో టెన్త్ పేపర్ లీక్ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. వికారాబాద్ జిల్లా తాండూరులో ఇన్విజిలెటర్ బందెప్ప మొబైల్ నుంచి తెలుగు పేపర్ లీక్ అయినట్లు పోలీసులు గుర్తించారు. పేపర్ లీక్ లో ముగ్గురు అధికారులు సూపరింటెండెంట్, డిపార్ట్ మెంట్ ఆఫీసర్, ఇన్విజిలేటర్‌ను సస్పెండ్ చేశారు .పేపర్ లీక్ పై అధికారులు పూర్తి స్థాయి విచారణ జరుపుతున్నారు. వికారాబాద్ జిల్లా తాండూరులో ఏప్రిల్ 3న పరీక్ష ప్రారంభమైన కొద్ది సేపటికే పరీక్షా పేపర్ వాట్సాప్ లో చక్కర్లు కొట్టింది. దీంతో స్థానికంగా కొందరు స్పందించి ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లినట్లు సమాచారం. ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న ఇన్విజిలెటర్ బందెప్పను పేపర్ లీకేజ్‌పై పోలీసులు ప్రశ్నిస్తున్నారు. అయితే మొదట పేపర్ లీక్

3వ పేజీలో...

### నేటినుంచి యధావిధిగా పరీక్షలు

**పాఠశాల విద్యాశాఖ స్పష్టీకరణ**

**హైదరాబాద్, ఏప్రిల్ 3 (సమ సమాజం):** వికారాబాద్ జిల్లా తాండూరులోని ప్రభుత్వ పాఠశాల-1లో సోమవారం ఉదయం తెలుగు ప్రశ్నాపత్రం బయటకు వచ్చిన నేపథ్యంలో మంగళవారం నాటి పరీక్ష వాయిదా వేసినట్లు సోషల్ మీడియాలో కథనాలు వచ్చాయి. ఈ కథనాలపై రాష్ట్ర పాఠశాల

3వ పేజీలో...

## సూరత్ కోర్టులో రాహుల్‌కు దక్కని ఊరట

### స్టే ఇచ్చేందుకు సెషన్స్ కోర్టు తిరస్కరణ

- ఈ నెల13 వరకు బెయిల్ పొడిగింపు
- కోర్టుకు హాజరైన రాహుల్, ప్రయాంక తదితరులు



**సూరత్, ఏప్రిల్3 (సమ సమాజం):** మోదీ ఇంటిపేరు కలవారందరూ దొంగలే అనే వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో దాఖలైన పరువునష్టం కేసులో రాహుల్‌గాంధీకి ఊరట దక్కలేదు. రాహుల్‌కు విధించిన శిక్షపై స్టే ఇచ్చేందుకు సూరత్ సెషన్స్ కోర్ట్ నిరాకరించింది. అయితే బెయిల్ మాత్రం ఈ నెల 13 వరకూ పొడిగించింది. అలాగే విచారణను మే 3కు వాయిదా వేసింది.సూరత్ సెషన్స్ కోర్టుకు రాహుల్‌తో పాటు ఆయన సోదరి ప్రియాంక వాద్రా, కాంగ్రెస్ ముఖ్యమంత్రులు, గుజరాత్ కాంగ్రెస్ నేతలు, ఇతర సీనియర్ నేతలు తరలివచ్చారు. ఈ కేసులో సూరత్ కోర్ట్ బెయిల్ పొడిగించినా ఆయనకు న్యాయపరమైన చిక్కులు ఎదురుకాబోతున్నాయి. పై కోర్టులు కనుక సూరత్ కోర్ట్ తీర్పును కొట్టేయకపోతే రాహుల్ ఎనిమిదేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయలేరు. అయితే సూరత్ కోర్ట్ తీర్పుపై ఉన్నత న్యాయస్థానానికి వెళ్లాలని కాంగ్రెస్ పార్టీ యోచిస్తోంది.వివాదాస్పద వ్యాఖ్యలపై సూరత్ కోర్ట్ తీర్పు నేపథ్యంలో రాహుల్ ఇటీవలే ఎంపీ సభ్యత్వం కూడా కోల్పోయారు. రెండేళ్ల జైలుశిక్ష పొందిన కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్ గాంధీపై అనర్హత వేటు పడింది. దీనికి సంబంధించి లోక్‌సభ సెక్రటేరియట్ నుంచి సర్క్యులర్ జారీ అయింది. 1951 ప్రజాప్రాతినిధ్య చట్టం సెక్షన్ 8(3) ప్రకారం ఆయనపై అనర్హత పడింది. సూరత్ కోర్ట్ తీర్పు ప్రకారం లోక్‌సభ సెక్రటేరియట్ ఆయనపై

3వ పేజీలో...

## నిర్లక్ష్యం నీడలో ప్రభుత్వ బడులు

### పాఠశాల బాత్‌రూమ్‌లో కరెంట్ షాక్‌కు గురైన విద్యార్థిని మృతి



**వికారాబాద్, ఏప్రిల్3 (సమ సమాజం):** వికారాబాద్ జిల్లా పూడూరు మండలం మంచన్ పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విషాదం చోటుచేసుకుంది. నాలుగో తరగతి చదువుతున్న దీక్షిత విద్యుదాఘాతంతో మృతి చెందింది. పాఠశాల బాత్‌రూమ్‌లో వేలాడుతున్న విద్యుత్ తీగ విద్యార్థిని కాలికి తగలడంతో ఆమె కిందపడిపోయి చేతితో వైర్లను తొలగించేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో విద్యార్థిని విద్యుదాఘాతానికి గురై చేతులు, కాళ్లకు తీవ్రగాయాలు కావడంతో కుప్పకూలిపోయింది. వెంటనే గమనించిన పాఠశాల ప్రిన్సిపాల్ స్థానికులు పరిగిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ విద్యార్థితో పాటు మరో నలుగురు విద్యార్థులు ఉన్నట్లు తెలుస్తోంది. దీక్షితకు విద్యుత్ షాక్ తగలడంతో తోటి విద్యార్థులు వెంటనే పాఠశాల ఉపాధ్యాయులకు సమాచారం అందించారు. ఒకవేళ దీక్షితను లేపేందుకు ప్రయత్నించి ఉంటే అది తీవ్ర విషాదం. పాఠశాల ఉపాధ్యాయురాలు, పాఠశాల మరమ్మతులు చేస్తున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే దీక్షిత మృతికి కారణమని బాలిక కుటుంబ సభ్యులు ఆరోపించారు. మన ఊరు, మన బడి కార్యక్రమంలో భాగంగా ఇటీవల పాఠశాలలో మరమ్మతులు చేపట్టారు.

## టెన్త్ పేపర్ లీక్‌పై ఎన్ఎస్‌యూఐ ఆందోళన బోర్డు కార్యాలయం ముట్టడి...

### మంత్రి సబిత బర్తరఫ్‌కు డిమాండ్



**హైదరాబాద్, ఏప్రిల్3 (సమ సమాజం):** టెన్త్ పేపర్ లీక్ ఘటనకు నిరసనగా ఎన్ఎస్ యూఐ ఆందోళనకు దిగింది. అబిడ్స్ లోని బోర్డు ముందు రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ ఆధ్వర్యం లో యూత్ కాంగ్రెస్ ఆందోళన చేపట్టింది. ఆందోళన కారులు బోర్డు గేటును ధ్వంసం చేశారు. కార్యాలయంపైకి కోడి గుడ్లు

2వ పేజీలో...

## కూల్‌రూఫ్ పాలసీతో తగ్గనున్న విద్యుత్ ఛార్జీలు

- భవనాలకు కూల్‌రూఫ్‌తో మంచి ప్రయోజనాలు
- ప్రజల్లో విస్తృతంతగా ప్రచారం చేయాలి
- కూల్‌రూఫ్ పాలసీ విడుదల సందర్భంగా కెటిఆర్



**హైదరాబాద్,ఏప్రిల్3 (సమ సమాజం):** దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం కూల్ రూఫ్ పాలసీని తీసుకొస్తున్నామని మంత్రి కేటీఆర్ అన్నారు. ఇది భవిష్యత్ తరాలకు ఉపయోగపడే కార్యక్రమమని చెప్పారు.

3వ పేజీలో...

## రేవంత్‌కు వెన్నుపోటు !.., కోమటిరెడ్డి బ్రదర్స్‌కు నమ్మిన బంటు !

# చల్లమల్ల కృష్ణారెడ్డి డబుల్ గేమ్ ?







### @ మునుగోడు నియోజకవర్గం కాంగ్రెస్

- కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోటాలో మునుగోడు అసెంబ్లీ సీటు
- రేవంత్‌కు దూరమౌతున్న చల్లమల్ల
- కోమటిరెడ్డితో చల్లమల్ల అలయ్... బలాయ్
- మునుగోడు కాంగ్రెస్‌లో చల్లమల్ల కుట్ర కోణం

**హైదరాబాద్ డెస్క్ , ఏప్రిల్ 1 (సమ సమాజం):** కాంగ్రెస్ పార్టీలో ముఖ్య సమావేశానికి కొందరు నేతలు హాజరు కాలేదు. మునుగోడు నియోజకవర్గ నేత టిపిసిసి ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న చల్లమల్ల కృష్ణారెడ్డి ఆదివారం జరిగిన టిపిసిసి కార్యవర్గ సమావేశానికి గైర్హాజరైయ్యారు. కారణాలు పక్కకుపెడితే ఇటీవల రేవంత్‌ను కలవడానికి చల్లమల్ల కిష్టారెడ్డి తీవ్ర ప్రయత్నాలు చేశారు. కాని అపాయింట్‌మెంట్ దొరక లేదు. ఆ తరువాత చల్లమల్ల తీరుతెన్నుల్లో మార్పు వచ్చింది. రేవంత్ దూరం పెట్టడంతో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దగ్గరకు వెళ్ళి ఆశీర్వాదాలు పొందారు. పైగా మునుగోడు సీటును కూడా కన్‌ఫమ్ చేసేందుకు మాట ఇచ్చారని ఊహాగానాలు వెలుబడుతున్నాయి. మునుగోడు సీటు చల్లమల్లకు ఇప్పించడంకు గల కారణం తన తమ్ముడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఉపఎన్నికల్లో గోర పరాజయం పాలైయ్యారు. ఆ సమయంలో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ స్టార్‌క్యాంప్యనీర్ అయినా కూడా తమ్ముని గెలుపుకోసం బాహాటంగానే ఎత్తులు వేశారు. కాని తగిన ఫలితం దక్కలేదు. ఆ చేదు అను భవాన్ని దృష్టిలోపెట్టుకొని రాజగోపాల్‌రెడ్డి గెలుపుకోసం ఇలాంటి నిర్ణయాలు తీసుకున్నట్లు జరుగుతున్న పరిణామాల బట్టి అర్థమౌతుంది. రేవంత్‌కు అనుచరుడిగా ఉన్న చల్లమల్ల వెన్నుపోటు పొడిచి, వెంకట్‌రెడ్డికి అనుచరుడిగా కొనసాగుతున్నడనే సంకేతాలు కనిపిస్తున్నాయి.

ఎన్నడు కాననోడు ఏకాడిస్తే.. ఎందుల పెట్టుకోవాలో తెలువక సందుల దూరిండన్నట్లు.. పిలిచి పదవిచ్చిన రేవంత్‌కు పంగనామాలు పెట్టి కోమటిరెడ్డి సరసన చేరిండని తెలంగాణ పొలిటికల్ సర్కిల్లో హాట్ టాపిక్‌గా నిలిచిండు చల్లమల్ల కృష్ణారెడ్డి. ఓ దిక్కు మునుగోడు నియోజకవర్గంలో గ్రూపు రాజకీయాలకు తెరలేపుతూనే.. శ్రావంతిని ఇరుకున బెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఇదిలా ఉంటే తెలంగాణ కాంగ్రెస్ టీపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో వెంకట్‌రెడ్డి తరుచు విమర్శలు చేయడం చేస్తుంటారు. వారిద్దరి మధ్య పచ్చగడ్డి బగ్గుమన్నట్లే ఉంటుంది. అలాంటి వారి మధ్య మరోమారు బగ్గుమనేలా కారణమైయ్యాడు చల్లమల్ల కృష్ణారెడ్డి. మునుగోడు నియోజక వర్గంలో వివాదస్పాద నేతగా తయారైన చల్లమల్ల కృష్ణారెడ్డి ఇటీవల రేవంత్‌ను కలవడానికి వెళ్లడంతో చల్లమల్లకు చుక్కెదురైంది. చల్లమల్లకు అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం, వెనువెంటనే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేరదీయడం జరిగింది. ఆ తరువాత గాంధీభవన్ కీలక మీటింగ్‌కు కూడా చల్లమల్ల గైర్హాజరు అయ్యారు. రేవంత్ దూరం పెట్టడం కారణంగా చల్లమల్ల కృష్ణారెడ్డిలో కలవరం మొదలైంది.

**తమ్ముని గెలుపుకు రాచమార్గం వెతికిన కోమటిరెడ్డి !**

నల్లగొండ జిల్లా కాంగ్రెస్ ముఖ్య నేతగా పేరొందిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తను చెప్పిన వారికే టికెట్ ఇవ్వాలని హైకమాండ్ దగ్గర కండీషన్‌లు పెట్టారని సమాచారం. సాధారణ ఎన్నికల్లో మునుగోడు టికెట్ చల్లమల్లకు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇప్పిస్తే తన తమ్ముడైన బీజేపీ అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి గెలుపు సులువౌతుంది. దీనితో మునుగోడు కాంగ్రెస్ కష్టాలపాలౌతది.

## పేపర్ల లీకేజీ తేలకుండానే మళ్లీ పరీక్షలా

### దోషులను కాపాడే యత్నంలో ప్రభుత్వ పెద్దలు

- ఈ వ్యవహారంలో అందరినీ విచారించాలి
- బోర్డును రద్దు చేసి..సిబిఐ విచారణకు ఇవ్వాలి
- కాకతీయలో విద్యార్థుల అరెస్ట్ దారుణం
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపాటు



**హైదరాబాద్,ఏప్రిల్3 (సమ సమాజం):** పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీకేజీ కేసులు తేల్చకుండా మళ్లీ పరీక్షలు పెడతామని మభ్య పెడుతున్నారని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. టిపిఎస్సీ చైర్మన్ జనార్ధన్ రెడ్డి... కేసీఆర్, కేటీఆర్ మాటలు విని..మళ్లీ ఎగ్జామ్స్ పెట్టాలని చూస్తున్నారని, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. ఒకవైపు చైర్మన్ జనార్ధన్ రెడ్డికి, బోర్డుసభ్యులకు సిట్ అధికారులు

3వ పేజీలో...

## స్వమిత్వ పథకాలన్ని అమలు చేయండి

### సిఎం కెసిఆర్‌కు కిషన్ రెడ్డి లేఖ



**హైదరాబాద్, ఏప్రిల్3 (సమ సమాజం):** గ్రామీణ ప్రాంతాల్లో ఆస్తి ధ్రువీకరణ పత్రాలను అందించే స్వమిత్వ పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని సీఎం కేసీఆర్ కు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లేఖ రాశారు. దేశవ్యాప్తంగా విజయవంతంగా అమలవుతున్న ఈ పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం కూడా 2022 ఏప్రిల్19న కేంద్రంతో అవగాహనా ఒప్పందాన్ని చేసుకుందని తెలిపారు. పైలెట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలోని 5 గ్రామాలలో డ్రోన్ సర్వేను విజయవంతంగా నిర్వహించిందని పేర్కొన్నారు. ఆస్తులకు సంబంధించిన మ్యాపులను రూపొందించిందని, ప్రస్తుతం ఈ మ్యాపులకు సంబంధించిన ధ్రు వీకరణ పత్రాలను రూపొందించి, హక్కుదారులకు పంపిణీ చేయవలసిన ప్రక్రియ రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి మిగిలింద న్నారు. తెలంగాణ రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టు విజయవంతంగా

3వ పేజీలో...

## సంపాదకీయం

# అవినీతి ముద్ర.. మోడీ రాజకీయం !



పృధ్వీరాజ్ గోసుకొండ
ఎడిటర్

విపక్షపార్టీల నేతలపై అవినీతి ముసుగు వేయడం ద్వారా మోడీ..తానొక్కడినే రాజకీయాల్లో సచ్ఛీలత గల నాయకుడిగా వెలుగొందాలని వ్యూహం పన్నుతున్నారు. గాంధీకి అసలుసిసలు వారసుడిగా దేశంలో నిలవాలని అనుకుంటున్నారు. దేశంలో ఇప్పటివరకు బిజెపియేతర పార్టీల నాయకులు ఏదో ఒక కేసులో ఆరోపణలు ఎదుర్కొంటూనే ఉన్నారు. దేశంలో పార్లమెంట్‌కూ, అసెంబ్లీలకు ఎన్నికవుతున్న నేర చరితుల సంఖ్య పెరుగుతూనే ఉంది. డబ్బులను విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్న వారు మాత్రమే ఎన్నికవుతున్నారు. వారు విదిల్చే డబ్బులకు అమ్ముడు పోతున్న ప్రజలు అవినీతిని పెద్దగా పట్టించుకోకుండా ఓటేస్తున్నారు. అవినీతి నేతల నేరాలను ప్రజలు పట్టించుకోవడం ఏనాడో మానివేశారని అర్థమవుతోంది.గతంలో జైన్ హవాలా కేసులో తన పేరు వచ్చినందుకు బీజేపీ అగ్రనేత లాల్ కృష్ణ ఆద్వాణీ తనను న్యాయస్థానం నిర్దోషిగా ప్రకటించనంతవరకూ ఎన్నికల్లో పోటీ చేయనని ప్రకటించారు. ఒకప్పుడు అలాంటి నేతలు నేతృత్వం వహించిన బీజేపీకి ఇప్పుడు మోదీ హయాంలో ప్రతిపక్షాల అవినీతి మాత్రమే కంటబడడం ఆశ్చర్యం కలుగక మానదు. రాజకీయ అవినీతిపై యుద్ధం ప్రారంభించి..రెండు రాష్ట్రాల్లో అధికారం చేజిక్కిం చుకున్న ఆమ్ ఆద్మీ పార్టీని..దాని అధినేత కేజ్రీవాల్‌ను కూడా అవినీతి కేసుల్లో ఇరికిస్తున్నారు. నిజానికి రాజకీయ అవినీతి లేదని చెప్పడం లేదు. అలాగే రాజకీయ అవినీతిని కూకటివేళ్లతో పెకిలించాల్సిందే. దీనికి కారకులైన రాజకీయ నేతలను దునుమాడాల్సిందే. అయితే అది అన్ని పార్టీలకు వర్తించాలి. అవినీతిపరులు ఏ పార్టీలో ఉన్నా వారిని తుదముట్టించాల్సిందే. ఈ చీడను వదిలించి దేశాన్ని రక్షించాల్సిందే. అంబేద్కర్ మహాశయుడు ఎంతో దూరదృష్టితో మనకు ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని అందించినా ఇంకా దేశంలో అవినీతి, కులరక్కసి కరాళనృత్యం చేస్తూనే ఉంది. అవినీతి వ్యతిరేక ప్రచారం చేస్తున్న బిజెపి తమ పార్టీ నేతలను కూడా ఏరిపారేస్తే..మోడీ ఇమేజ్ పెరిగేది. రాజకీయ అవినీతికి బిజెపి ఇతర పార్టీల నేతలతో పోలిస్తే తక్కువేమీ కాదు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో అవినీతి అంతకుమించి అన్నట్లుగా ఉంది. కానీ మొత్తం అన్ని రాష్ట్రాలను కబళించే ప్రయత్నంలో బిజెపియేతర రాష్ట్రాల్లో ఉన్న నేతలపై అవినీతి ముద్ర వేసి వారిని అవినీతిపరుగులగా ముద్ర వేసే బృహత్తర వ్యూహం ప్రస్తుతం దేశంలో ఊపందు కుంది. ఢిల్లీమద్యం కుంభకోణంలో ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాను జైలుపాలు చేయడం, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను ఈడీ విచారణకు పిలిపించడం, దేశంలోని ప్రతిపక్ష నేతలు అందరినీ ఏదో ఒక కేసులో ఇరికించడం ద్వారా భారతీయ జనతా పార్టీ ప్రజలకు పంపిస్తున్న సందేశమేమిటన్నదే చర్చ. దీని వెనక ఉన్న వ్యూహం ఏమిటన్నది చర్చించాల్సి ఉంది. ప్రతిపక్ష నేతలందరూ అవినీతిలో మునిగి పోయారని, భారతీయ జనతా పార్టీ ఒక్కటే అవినీతి అంటని స్వచ్ఛమైన కమలమని ప్రజల్లో భావవ్యాప్తిని మోడీ కోరుకుంటున్నారు. వచ్చే ఎన్నికలు అవినీతి ప్రాతిపదికపై జరిగితే తమకు రాజకీయ ప్రయోజనాలు లభిస్తాయని కూడా ఆ పార్టీ భావిస్తున్నట్లు కనపడుతోంది. అందుకే ఆప్, బిఆర్ఎస్, వైసిపి, తృణమూల్, జెడిఎస్, లాలూ, నితీశ్ , తేజస్వీ ఇలా అందరినీ ఆటపట్టించే ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయి. అది సాధ్యమా లేదా అన్న అన్నదే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఎవరు ఎంత అవినీతికి పాల్పడ్డారన్నది అంతిమంగా న్యాయస్థానాలు నిగ్గు తేలుస్తాయి. ఇకపోతే అవినీతి కాకుంటే..మరో కారణంతో కూడా వారిని రాజకీయాలకు దూరం చేసే వ్యూహాలు సాగుతున్నాయి. ఈ విషయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ..లాంటి వారిని ఇందుకు బలి చేశారు. దేశంలో న్యాయస్థానాల్లో విచారణ నత్తనడకగా సాగుతున్న తీరుతో ఒక నాయకుడి అవినీతి తేల్చడానికి ఏళ్ల తరబడి సమయం పడుతోంది. న్యాయస్థానాల్లో కేసులు త్వరగా తెమలడం లేదు.

మోదీ హయాంలో సోదాలు, దాడులు, విచారణల పేరుతో కేంద్ర ఏజెన్సీలు చేస్తున్న హడావిడితో విపక్ష పార్టీలకు మాత్రం నిద్ర పట్టడం లేదు. ఈ క్రమంలో వారిని అవినీతిపరులుగా ప్రాచరం చేసుకుంటూ పోతున్నారు. పీవీ నరసింహారావు హయాంలో కేంద్ర మంత్రి కల్పనాథ్ రాయ్ తన మంత్రిత్వ శాఖకు చెందిన అతిథి గృహాల్లో ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించారన్న ఆరోపణపై జైలు పాలైనప్పటికీ ఆయన ఎన్నికల్లో గెలుస్తూనే పోయారు. 2జీ కేసులో డిఎంకె నేత కనిమొళి జైలుకు వెళ్లి వచ్చినా గత ఎన్నికల్లో ప్రజలు ఆమెను దాదాపు 60 శాతం ఓట్లతో గెలిపించారు. మూడవది, ప్రజల మద్దతుతో తాము బలం పెంచుకుని రాజకీయంగా ప్రత్యర్థులను ఓడించడం సాధ్యం కానంతవరకూ వ్యక్తులపై అవినీతి ఆరోపణల బూచితో ప్రభుత్వాలను మార్చడం అంత సులభం కాదు. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీని అసెంబ్లీ ఎన్నికల్లో గద్దె దించేందుకు బీజేపీ రెండుసార్లు ప్రయత్నించినప్పటికీ ఆ పార్టీ విజయవంతం కాలేదు. ఇటీవల జరిగిన ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూడా ఆప్‌ను బీజేపీ దెబ్బతీయలేకపోయింది. ఉదాహరణకు ఉభయ తెలుగు రాష్ట్రాలను తీసుకుంటే..ఇక్కడ ఎన్నికల్లో పాగా వేయాలన్న లక్ష్యంతో అవినీతి కేసులను పురమా యిస్తున్నారు. ప్రత్యేకించి తెలంగాణలో బిజెపి చేసిన మేలు ఏదీ లేదు. కానీ కెసిఆర్ అవినీతిని, కుటుంబ పాలనను బూచిగా చూపి అధికారంలోకి రావాలని చూస్తోంది. పక్కనున్న కర్నాటకలో ఏం జరుగుతుందో చూస్తున్నాం. డబుల్ ఇంజిన్ సర్కార్ పేరుతో డాంబికాలు తప్ప ఏమీ లాభం లేకుండా పోతోంది. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ అభివృద్ధి అన్నది రోల్‌మాడల్‌గా నిలిచింది. ఇక్కడ 9 ఏళ్లలో గణనీయ మైన ప్రగతి కళ్లకు కనిపిస్తుంది. ఇకపోతే అవినీతికి సంబంధించి కేసుల సంఖ్య పెరిగినప్పటికీ శిక్ష పడిన వారి సంఖ్య తక్కువే. ఎవరికి శిక్ష పడిందో, ఎవరికి పడలేదో ప్రజలు గుర్తుంచుకునే పరిస్థితిలో లేరు. మరో ముఖ్యమైన విషయమేమిటంటే ఈడీ, సిబిఐ నివేదికలు, విచారణలకు ఎంత పబ్లిసిటీ లభించినప్పటికీ వాటి వల్ల రాజకీయ ప్రయోజనాలు లభించకపోతే మోదీ వ్యూహం బూమరాంగ్ కాగలదు.

# పోడు సమస్యలపై శ్వేతపత్రం

లబ్దిదారుల జాబితా విడుదల చేయాలి • పోడు పట్టాలను వెంటనే అమలు చేయాలి • సిఎం కెసిఆర్‌కు లేఖ రాసిన మల్లు భట్టి విక్రమార్క



**మంచిర్యాల,ఏప్రిల్3(సమసమాజం):** పోడుభూముల పట్టాలు, అర్హుల జాబితాపై శ్వేతపత్రం విడుదల చేయాలని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. వెంటనే పోడుపట్టాలు అందించాలన్నారు. దీనికి సంబంధించి లబ్దిదారుల జాబితా విడుదల చేయాలని సిఎం కెసిఆర్‌కు లేఖ రాశారు. మంచిర్యాల జిల్లాలో భట్టి హాత్ సే హాత్ జోడో యాత్ర కొనసాగుతోంది. ఆదివారం మండలంలోని దాంపూర్ నుంచి బూరుగుపల్లి, పోతనపల్లి గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు. సోమవారం మందమర్రి టౌన్‌లో యాత్ర కొనసాగుతోంది. యాత్రలో ముఖ్యమంత్రి కేసీఆర్‌కుభట్టి విక్రమార్క సోమవారం బహిరంగ లేఖ రాశారు. లేఖలో పోడు రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 18రోజులుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పాదయాత్ర చేస్తున్నాను..ఏ ఊరికి వెళ్లినా పోడు రైతులు పట్టాల కోసం ఎదురు చూస్తున్నారు. కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన పత్రాలు తప్ప మళ్ళీ రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోడు రైతులందరికి పట్టాలు ఇవ్వాలి..వారిపై ఉన్న కేసులను ఎత్తేయాలని భట్టి విక్రమార్క లేఖలో పేర్కొన్నారు. యాత్రలో పాల్గొనేందుకు మందమర్రి కాంగ్రెస్ నాయకులు తరలి వెళ్తున్నారు. కొన్నేళ్లుగా అదివాసులు, గిరిజనులు పోడు భూముల సమస్యతో అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పోడు భూములకు సంబంధించిన అనేక సమస్యలను భట్టి తన లేఖలో ప్రస్తావించారు. అదివాసులు, గిరిజనులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు, ప్రకటనలు నీటి మీద రాతలు లాగా మిగిలిపోయాయని అన్నారు భట్టి. పోడు భూములపై పరిష్కారం చూపకపోతే తాము పోరాటాలు చేస్తామని చెప్పారు. అదివాసులు, గిరిజనులు రోడ్ల మీదికి రాకముందే సమస్యను పరిష్కారించాలని కోరారు.

# షెడ్యూల్ ప్రకారమే ఎపిలో ఎన్నికలు

- ఏ ఒక్క ఎమ్మెల్యేను వదులుకోం
- అందరినీ గెలిపించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తా
- ఎమ్మెల్యేలతో భేటీలో సిఎం జగన్ స్పష్టీకరణ
- టిడిపి,ఎల్లో మీడియా ప్రచారాలను నమ్మొద్దని హెచ్చరిక



**అమరావతి, ఏప్రిల్ 3 (సమసమాజం):** ఏపీలో ముందస్తు ఎన్నికలు వస్తున్నాయని.. తెలంగాణ రాష్ట్రంతోపాటు నిర్వహించనున్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదని సిఎం జగన్ స్పష్టం చేశారు. షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు వచ్చే ఏడాది జరుగుతాయని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచామని టీడీపీ గొప్పలకు పోతుందని, ఎమ్మెల్యేలతో భేటీలో ఎమ్మెల్సీ ఫలితాలపై సీఎం జగన్ స్పష్టతనిచ్చారు. 21 స్థానాల్లో.. 17 స్థానాలు వైసీపీ గెలిచిందని, ఉన్నది లేనట్టుగా మారీచులు ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఒక ఎమ్మెల్సీ స్థానం అంటే 34 నుంచి 39 నియోజకవర్గాల పరిధి ఉంటుందని, 80లక్షల ఓట్లలో కేవలం రెండున్నర లక్షలమంది మాత్రమే పట్టభద్రులు ఉన్నారని ఆయన తెలిపారు. పట్టభద్రుల ఓటర్లలో రకరకాల యూనియన్లు ఉన్నాయని, అందులో 87? మాతోనే ఉన్నారని సీఎం జగన్ తేల్చి చెప్పారు. కేవలం 20? మంది మాత్రమే డీబీటీలో ఉన్నారని, వచ్చే ఎన్నికలకు ఇది ఏమాత్రం శాంపిల్ కాదంటూ ఎమ్మెల్యేలతో భేటీలో ఎమ్మెల్సీ ఫలితాలపై సీఎం స్పష్టత నిచ్చారు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఒక్క ఎమ్మెల్యేనూ వదలుకోమని, అందర్నీ గెలిపించుకుటామని అన్నారు. కానీ, ఎమ్మెల్యేలంతా క్రియాశీలకంగా ఉండాలని, సోషల్ మీడియాను బాగా ఉపయోగించుకోవాలని సూచించారు. గడప గడపకు త్వరగా పూర్తి చేయాలని, నెలకు 25రోజులు సచివాలయాల్లో తిరగాలని, సెప్టెంబరు నుంచి కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని సీఎం జగన్ ఉద్ఘాటించారు.మంత్రి జోగి రమేష్ స్పష్టం చేశారు. సీఎం జగన్ క్యాంప్ ఆఫీసులో ఎమ్మెల్యేలతో భేటీ జరిగింది. ఈ సందర్భంగా జగన్ చేసిన వ్యాఖ్యలు, ఎమ్మెల్యేలకు ఇచ్చిన ఉపదేశాన్ని మంత్రి జోగి రమేష్ వివరించారు. ఏపీలో ఎన్నికలు షెడ్యూల్ ప్రకారం 2024లోనే జరుగుతాయని వివరించారాని తెలిపారు. 60 మంది ఎమ్మెల్యేలను మార్చుతున్నట్లు వార్తలను సైతం జగన్ ఖండించారని.. అందరినీ గెలిపించుకునే బాధ్యత పార్టీపై ఉందన్నారాయన. ఒక్క ఎమ్మెల్యేను కూడా వదులుకోం.. అందర్నీ గెలిపించుకుంటాం అని స్పష్టంచేసినట్లు వివరించారు. నాలుగు ఎమ్మెల్సీల ఓటమిపై జగన్ స్పందిస్తూ.. వాపును చూసి బలుపు అని టీడీపీ భావిస్తుందని.. తప్పుడు వార్తలతో నిజాన్ని సమాధి చేయాలని చూస్తున్నారంటూ జగన్ వ్యాఖ్యానించారు. గడప గడపకు కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని.. ఎన్నికలకు ఏడాది మాత్రమే సమయం ఉన్నట్లు వెల్లడించారాయన. 2024 ఎన్నికల్లో గెలిచే బాధ్యత ఎమ్మెల్యేలపైనే ఉందని.. గెలిచి తీరాల్సిన అవసరం ఉందని హెచ్చరించారు జగన్. ప్రతి ఎమ్మెల్యే సోషల్ మీడియాను బాగా ఉపయోగించుకోవాలని.. ఇంటింటికీ వెళ్లటంతోపాటు నిరంతరం సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వ పథకాలను జనంలోకి తీసుకెళ్లాలని హితబోధ చేశారు జగన్. ఎమ్మెల్యేల గ్రాఫ్ సరిగాలేకపోతే వ్యక్తిగతంగా మీతోపాటు.. పార్టీకి సైతం నష్టం అని.. ప్రతి ఎమ్మెల్యే కష్టపడి పని చేయాలని.. ఉన్న ఏడాది కాలాన్ని సద్వినియోగం చేసుకుని ముందుకు వెళ్లాలని సీఎం జగన్ సూచించారు.ప్రజలకు మంచి చేస్తున్నా.. ఎల్లో మీడియా తమ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తోందని సీఎం జగన్ ధ్వజమెత్తారు. రాబోయే రోజుల్లో ఇలాంటి రూమర్స్ ఇంకా ఎక్కువ జరుగుతాయని తెలిపారు. కార్యకర్తలు, నాయకులు వాటికి భంగ పడకుండా ఉండాలని సూచించారు. కొందరు.. ఎమ్మెల్యేలను టార్గెట్ చేసి వాళ్లపై విష ప్రచారం చేస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలతో ఏదో జరిగిందని ప్రజలను మభ్య పెడుతున్నారు. 21 స్థానాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు వస్తే 17 తమ పార్టీ గెలిచిందని జగన్ గుర్తు చేశారు. ఏ ఒక్క ఎమ్మెల్యేను పోగొట్టుకోనని, అందరితో పనిచేయించి గెలిపించుకునేందుకే ప్రయత్నాలు చేస్తానని, ఎవరు చేయాల్సిన పని వాళ్లు చేస్తే 175 సీట్లు గెలుస్తామంటూ ఎమ్మెల్యేలకు సీఎం జగన్ భరోసా అందించారు.

# మోడీని నిలువరించే సత్తా బిఆర్ఎస్‌కే ఉంది

## అందుకే కెసిఆర్ జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశం




### దేశంలో కాంగ్రెస్ పని కూడా అయిపోయింది

### బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి జగదీశ్ రెడ్డి

**నల్లగొండ,ఏప్రిల్3(సమసమాజం):** మోడీ దుర్మార్గాలను నిలువరించేందుకే బీఆర్ఎస్‌గా దేశ రాజకీయాల్లోకి అడుగుపెట్టామని, దేశమంతా ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన కోసం ఎదురుచూస్తుందని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి తెలిపారు. దేశ రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీ దాదాపు అంతర్ధానమైనట్లేనని మంత్రి అన్నారు.గుర్రంపూడ్ మండల కేంద్రంలో ఎమ్మెల్యే నోముల భగత్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం మంత్రి జగదీశ్ రెడ్డి, ట్రై కార్ చైర్మన్ ఇస్లావత్ రామచంద్రనాయక్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేశ రాజకీయాల గురించి మాట్లాడిన జగదీశ్ రెడ్డి.. ప్రధాని మోడీ, కాంగ్రెస్ పార్టీలపై ధ్వజమెత్తారు. దేశ రాజకీయాల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రధాన ప్రతిపక్షం లేకుండపోయిందన్నారు. కాంగ్రెస్ పార్టీ జీవవచ్ఛంలా మారిందని.. రాహుల్ గాంధీనీ తొలగిస్తేనే కాంగ్రెస్‌కు సోయి లేదని అన్నారు. రాహుల్ గాంధీని పార్లమెంట్ నుంచి తొలగిస్తే ఆ పార్టీకి సోయి లేకుండా పోయిందని, ఆ పార్టీ జీవచ్ఛవంలా మారింది అనేందుకు ఇంతకంటే పెద్ద నిదర్శనం అక్కర్లేదన్నారు. ఇప్పటికే మోడీ పాలనపై మాహారాష్ట్ర నుంచి బీఆర్ఎస్ పార్టీ విప్లవం మొదలుపెట్టింది. ఉత్తరప్రదేశ్ రైతాంగం.. కేంద్రంపై తిరుగు బాటుకు శ్రీకారం చుట్టిందని వెల్లడించారు. రైతుభీమా కోసం సరిహద్దు రాష్ట్రాల రైతులు తెలంగాణాలో భూములు కొంటున్నారని చెప్పుకొచ్చారు. మోడీ పాలనలో గుజరాత్ లోనూ దారిద్య్రం పెరిగిపోయింది. 27 రాష్ట్రాల్లోని ప్రజలు రోజుకు ఒక్క పూట భోజనం చేస్తున్నారు. దేశంలో ఇప్పటికీ 35 నుండి 40 శాతం మంది ప్రజలు పస్తులుంటున్నారని మండి పడ్డారు. ఈయన పాలనలో దారిద్య్రం విలయతాండవం చేస్తుంటే చూడలేకపోతున్నామని జగదీశ్ రెడ్డి అన్నారు. భారత్.. పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల కంటే దైన్యస్థితిలో ఉందని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనాల్లో భాగంగా సోమవారం నాగార్జున సాగర్ నియోజకవర్గ పరిధిలోని గుర్రంపోడు మండల కేంద్రంతో పాటు దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని పీఏపల్లి మండలం అంగడిపేటలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే నోముల భగత్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మోదీ దుర్మార్గాలను నిలువరించేందుకే టీఆర్ఎస్.. బీఆర్ఎస్‌గా రూపాంతరం చెందిందన్నారు. యావత్ భారతదేశం సీఎం కేసీఆర్ కోసం నిరీక్షిస్తుందన్నారు. మహారాష్ట్రతో సహా భారతదేశంలోనీ రైతాంగం, రైతు సంఘాల ప్రతినిధులు బీఆర్ఎస్‌లో చేరేందుకు బారులు తీరుతున్నారన్నారు. ఇప్పటికే మోదీకి వ్యతిరేకంగా మహారాష్ట్రలో రైతు విప్లవం మొదలైందని, మధ్యప్రదేశ్ మీదుగా ఉత్తరప్రదేశ్‌కు చేరుకొని అక్కడ తిరుగుబాటుకు శంఖారావం పూరిస్తున్నారన్నారు. రైతుబీమా కోసం తెలంగాణ రాష్ట్రాన్ని ఆనుకొని ఉన్న సరిహద్దు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రైతాంగం గుంట, అరగుంట భూములు కొనుగోలు చేయడంతో పాటు తెలంగాణా ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్ కోసం బోర్లు వేసుకుంటున్నారని మంత్రి పేర్కొన్నారు. 27 రాష్ట్రాల్లో ఇప్పటికీ ఒక్క పూట పస్తులు ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కపూట భోజనాలకే పరిమితమై దేశంలో పస్తులుంటున్న వారి శాతం 35 నుంచి 40 శాతానికి చేరుకుందన్నారు.

# టెన్త్ పేపర్ లీక్..వాట్సాప్‌లో ప్రత్యక్షం

**వికారాబాద్,ఏప్రిల్3(సమసమాజం):** తాండూరులో పదవతరగతి ప్రశ్నాపత్రం లీక్ అవ్వడం కలకలం రేపింది. ఉదయం 9 : 30 నిమిషాలకు పరీక్ష స్టార్ట్ కాగా 9 : 37 నిమిషాలకు వాట్సాప్ లో ప్రశ్నాపత్రం లీక్ అయింది. తాండూరులోని ఓ సెంటర్ లో ప్రశ్నాపత్రం లీక్ అయినట్లుగా తెలుస్తోంది. అయితే తమ జిల్లాలో ప్రశ్నాపత్రం లీక్ అవ్వలేదని వికారాబాద్ డీఈవో చెబుతున్నారు. ప్రశ్నాపత్రం లీక్ అవ్వడంతో విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. తెలుగు పేపర్ లీక్ అయినట్లు గుర్తించారు. వెంటనే సమాచారం అందుకున్న డిఇవో విచారణకు ఆదేశించారు.

# మేమంతా రాజకీయ బిచ్చగాళ్లం

## బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్




**జగిత్యాల,ఏప్రిల్3(సమసమాజం):** బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజకీయంలోకి వచ్చాక తామంతా ఓట్ల బిచ్చగాళ్ళమని.. ఏదైనా తప్పు మాట్లాడితే అయిదారు వందల ఓట్లు పోతాయన్న భయం ఉంటుందని తెలిపారు సంజయ్ కుమార్. ఒక్కో ఓటు ఎలా తెచ్చుకోవాలని చూస్తామన్నారాయన. ఓట్లను పోగొట్టుకోవాలని ఎవరు అనుకోరు కదా అని సంజయ్ కుమార్ చెప్పారు.మంచి మాట్లాడితే ఓట్లు వేస్తారన్నారు సంజయ్ కుమార్. ఏప్రిల్ 2వ తేదీ ఆదివారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ కాలేజీలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కామెంట్స్ రాజకీయ వర్గాల్లో చర్చాంశనీయంగా మారాయి.

# టెన్త్ పేపర్ లీక్‌పై ఎన్ఎస్‌యూఐ ఆందోళన



(మొదటి పేజీ తరువాయి) విసిరారు. మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను చెట్టుకు ఉరి వేసి తగులబెట్టేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకు న్నారు. పోలీసులను తోసివేసి దిష్టిబొమ్మను దహనం చేశారు నాయకులు. కార్యాలయం లోపలికి వెళ్లేందుకు యత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు, ఎన్ఎస్ యూఐ నేతలకు మధ్య వాగ్వాదం జరిగింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో బల్మూరి వెంకట్ సహా పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా 10వ తరగతి పరీక్ష ప్రశ్న పత్రాల లీకేజ్ పై సమగ్ర విచారణ జరిపించాలంటూ ఎన్ఎస్ యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ డిమాండ్ చేశారు. తక్షణమే విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలన్నారు..లేకపోతే ప్రగతి భవన్ కు ఇదే గతి పడుతుందని హెచ్చరించారు. వికారాబాద్ తాండూరులో టెన్త్ పేపర్ లీక్ అయినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. వికారాబాద్ జిల్లా తాండూరులో స్కూల్ అసిస్టెంట్ సందప్ప మొబైల్ నుంచి తెలుగు పేపర్ లీక్ అయినట్లు పోలీసులు గుర్తించారు. పేపర్ లీక్ లో ముగ్గురు అధికారులు సూపరింటెండెంట్, డిపార్ట్ మెంట్ ఆఫీసర్, ఇన్విజిలేటర్ ను సస్పెండ్ చేశారు .పేపర్ లీక్ పై అధికారులు పూర్తి స్థాయి విచారణ జరుపుతున్నారు.

# సిసోడియా, పిళ్లెల కస్టడీ 17 వరకు పొడిగింపు



**న్యూఢిల్లీ,ఏప్రిల్3(సమసమాజం):** లిక్కర్ స్కాం కేసులో ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాకు రోస్ అవెన్యూ కోర్టు షాకిచ్చింది. సిసోడియా జ్యూడిషియల్ కస్టడీని ఏప్రిల్ 17 వరకు పొడిగించింది. సిసోడియా రిమాండ్ ఏప్రిల్ 3 తో ముగియనుండటంతో అతడిని సీబీఐ అధికారులు కోర్టులో ప్రవేశ పెట్టారు. దర్యాప్తు కీలక దశలో ఉందని.. సిసోడియా కస్టడీని పొడిగించాలని సీబీఐ కోరింది. వాదనలు విన్న కోర్ట్ సిసోడియా కస్టడీని ఏప్రిల్ 17 వరకు పొడిగించింది. దీంతో సిసోడియా మరోసారి కస్టడీలోనే ఉండాల్సిన పరిస్థితి.ఇదే కేసులో మరో నిందితుడు అరుణ్ రామచంద్ర పిళ్ళై కస్టడీని ఏప్రిల్ 17 వరకు పొడిగించింది ఢిల్లీ కోర్టు. ఏప్రిల్ 3 తో పి÷-లళై కస్టడీ ముగియడంతో సిబిఐ కోర్టులో హాజరు పరిచారు ఈడీ అధికారులు. కస్టడీని పొడిగించిన కోర్టు.. ఏప్రిల్ 12న సీబీఐ కేసులో కోర్టులో హాజరుకావాలని ఉత్తర్వులు జారీ చేసింది.

# పుట్టెడు దుఃఖంతో పరీక్ష రాసిన విద్యార్థి

## తండ్రి మరణంతో విధిలేక పరీక్షకు హాజరు

**నిర్మల్,ఏప్రిల్3(సమసమాజం):** తెలుగు రాష్ట్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభం కావడంతో పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులతో సందడి నెలకొంది. ఏపీలో ఒక్క నిమిషం నిబంధన ఉండడంతో పరీక్షా కేంద్రాలకు పరుగులు పెట్టారు విద్యార్థులు.. అటు తెలంగాణలో పరీక్ష సార్ట్ అయిన 5 నిమిషాల వరకూ అనుమతి ఉండడంతో ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా అధికారులు విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. అయితే, పదో తరగతి పరీక్షల వేళ.. ఓ విషాద ఘటన అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. ఓ విద్యార్థి పుట్టెడుదుఃఖాన్ని దిగమింగి ఎగ్జామ్ రాసేందుకు వచ్చాడు. ఎందుకంటే ఎగ్జామ్ రాసేందుకు వచ్చిన ఆ విద్యార్థికి తన తండ్రి మరణ వార్త తెలిసింది. అయినప్పటికీ.. ఆ విద్యార్థి తండ్రి చనిపోయిన దుఃఖంలోనే ఎగ్జామ్ రాసేందుకు హాజరయ్యాడు..ఈ ఉదయం తండ్రి అనారోగ్యంతో చనిపోయాడు.. ఈ ఘటన తెలంగాణలోని నిర్మల్ జిల్లా కడెం మండల కేంద్రంలో జరిగింది. తండ్రి శవాన్ని ఇంట్లో ఉండగానే అతను పరీక్ష రాసి ఇంటికి వెళ్లాడు. అతడికి తోటి విద్యార్థులు సానుభూతి ప్రకటించారు. ఇదిలాఉంటే.. అనంతపురం జిల్లాలోనూ మరో విద్యార్థి పెద్ద ప్రమాదం తృటిలో తప్పింది..టెన్త్ ఎగ్జామ్ సప్లిమెంటరీ రాసేందుకు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. బైక్‌పై వెళ్తున్న ఇద్దరిని అతి వేగంగా వచ్చిన కారు ఢీ కొట్టింది. దీంతో ఇద్దరికి తీవ్రగాయాలైయ్యాయి. స్థానికులు ఇద్దరిని ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే విద్యార్థి గాయాలతో బయటపడ్డంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

# తెలంగాణలో అప్పుడే ఎన్నికల వేడి

- అధికార పార్టీకి సవాల్ విసిరేలా నేతల దూకుడు
- ఎదురుదాడి ప్రచారం లో ముందున్న బిఆర్ఎస్
- కెసిఆర్‌పై నియంత పాలన అంటూ విమర్శలు




**హైదరాబాద్,ఏప్రిల్3(సమసమాజం):** తెలంగాణలో సాధారణ ఎన్నికలకు మరో ఆరు నెలల సమయం ఉంది. కానీ రాజకీయ పార్టీలు అన్నీ అప్పుడే ప్రచారంలోకి దిగాయా అన్న సందేహం వస్తోంది. అధికార బిఆర్ఎస్‌ను దెబ్బకొట్టడమే లక్ష్యంగా కాంగ్రెస్ బిజెపిలు కత్తులు నూరుతున్నాయి. అయితే వీరికన్నా ముందే బిఆర్ఎస్ బిజెపిని ఎండగడుతూ సిలిండర్‌ను చూపుతూ ప్రచారం చేస్తోంది. ప్రధానంగా గ్యాస్, పెట్రో ధరలనే హైలెట్ చేస్తోంది. కులాల వారీగా, వర్గాలవారీగా, వృత్తుల వారీగా, సంఘాల వారీగా సమావేశాలు నిర్వహించి ఆకట్టుకుంటున్నారు. పతకాల్లో ప్రభుత్వం జోరు పెంచింది. ఆత్మీయ సమ్మేళనాలు జోరుగా సాగుతున్నాయి. ప్రజలంతా బిఆర్ఎస్ వెంటే ఉన్నారంటూ ప్రచారం చేస్తున్నారు. మంత్రులు,ఎమ్ఎల్యేలు, ఇతర నేతలు అంతా నియోజకవర్గాల్లోనే మకాం వేసి పార్టీ వ్యూహాలను అమలు చేయడంలో క్రియా శీలకంగా సాగుతున్నారు. బిఆర్ఎస్ మళ్లీ గెలిపిస్తేనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు మరింత మెరుగ్గా కొనసాగే అవకాశాలుంటాయని ప్రజల్లో అభిప్రాయం కలిగిస్తున్నారు. ప్రచారపర్వంలో ఎదుటి పార్టీలపై వ్యక్తిగతంగా, రాజకీయంగా విమర్శల దాడిని పెంచి ముందుకు సాగుతున్నారు. కెటిఆర్,హరీష్ రావులు మరో అడుగు ముందుకు వేసి లేఖలు రాస్తూ కేంద్రాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నం చేశారు. గ్యాస్, పెట్రోల్ ధరలు పెంచిన బీజేపీకి ఓటేద్దామా, రైతుల నడ్డివిరిచే చట్టాలు తీసుకువచ్చిన బీజేపీని గెలిపిద్దామా అంటూ బీజేపీపై రాజకీయ దాడిని ప్రారంభించారు. తద్వారా పరోక్షంగా ఆ పార్టీ ప్రాభవాన్ని తగ్గించడానికి కొత్త వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. అలాగే అన్ని పార్టీల నుంచి అగ్రనేతలు నియోజకవర్గానికి వస్తున్నారు. నియోజకవర్గ ప్రజలను ప్రభావితం చేసేందుకు బిఆర్ఎస్ ప్రణాళిక సిద్దం చేస్తోంది. రాబోయే ఎన్నికలో గెలుపు బిఆర్ఎస్‌కు అత్యంత ముఖ్యం. బిజేపీ, బిఆర్ఎస్ అదే లక్ష్యంతో గెలుపు కోసం ప్రచారంలో పరుగులు పెడుతున్నాయి. కేసీఆర్ వ్యూహరచనను క్షేత్ర స్థాయిలో అమలు చేస్తూ మంత్రులు ప్రచారాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. బీజేపీకి పార్టీపరంగా ఇక్కడ పెద్దగా పట్టు లేకున్నా సవాళ్లతో ఎన్నికల్లో విజయం సాధిస్తామని ప్రకటిస్తున్నారు. గతంలో వెళ్లిపోయిన టీఆర్ఎస్ నేతలను తిరిగి పార్టీలోకి వచ్చేలా చేయడంలో ప్రయత్నాలు ప్రారంభించారు. కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ, తదితర పార్టీల్లోని పలువురు నాయకులను, ముఖ్య కార్యకర్తలను కూడా ఆకర్షించి బిఆర్ఎస్‌లో చేరేలా పార్టీకి మరింత జవసత్వాలను కల్పిస్తున్నారు. ప్రజాక్షేత్రంలో నువ్వానేనా అన్నట్లుగా ఎన్నికల ప్రకటనకు ముందే కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు పోటీపడి ప్రచారం కొనసాగిస్తున్నారు. బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు బండి సంజయ్,కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, విజయశాంతి, ఎమ్మెల్యేలు రఘునందన్‌రావు, రాజాసింగ్, ఎంపీ ధర్మపురి అరవింద్, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, హిమాచల్ ప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్‌రావు, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ తదితర పెద్దలు వివిధ కార్యక్రమాలతో ప్రజల్లో నిత్యం నానుతున్నారు. ఇకపోతే అధికార బిఆర్ఎస్ఎస్ శ్రేణులు ఇప్పటికే అన్ని గ్రామాల్లో మకాం వేసి ప్రజలను వ్యక్తిగతంగా కలిసే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగాలని ఆ పార్టీ నాయకత్వం భావిస్తున్నది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కూడా పాదయాత్రతో పర్యటించి ప్రచారాన్ని విస్తృతం చేయాలని భావిస్తున్నారు. కాంగ్రెస్‌కు చెందిన మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి,ఎమ్మెల్యే సీతక్క, ఇతర ముఖ్య నాయకులు కూడా రోజుకో కార్యక్రమంతో అప్పుడే ప్రచారంలో దూసుకుపోతున్నారు.

# సత్యం, న్యాయానికి బ్రాండ్ అంబాసిడర్‌గా సిబిఐ

- ఎవరికీ తలవంచాల్సిన అవసరం మీకు లేదు
- మీ బాధ్యత నిర్వహణలో వెనకడుగు వేయరాదు
- పెద్ద తలకాలయలు నేటికీ అధికారంలో ఉన్నార
- సిబిఐ వ్యవస్థాపక దినోత్సవంలో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 (సమసమాజం):** కేంద్ర దర్యాప్తు సంస్థ సత్యం, న్యాయానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. 1963లో ఏర్పాటైన సీబీఐ తన పనితీరు, సామర్థ్యంతో సామాన్య ప్రజానీకం నమ్మకాన్ని సైతం చూరగొందని అన్నారు. ఏదైనా కేసు పరిష్కారం కోసం సీబీఐకి అప్పగించాలనే డిమాండ్ ఇప్పటికీ వినిపిస్తూనే ఉందని అన్నారు. సోమవారంనాడిక్కడ జరిగిన సీబీఐ డైమండ్ జూబ్లీ వేడుకల కార్యక్రమంలో ప్రధాని మాట్లాడుతూ, వృత్తిపరమైన నిబద్ధత, సమర్థత కలిగిన సీబీఐ వంటి సంస్థలు లేకుండా అభివృద్ధి భారతాన్ని నిర్మించడం సాధ్యం కాదని, ఈ దిశగా సీబీఐపై అతిపెద్ద బాధ్యత ఉందని అన్నారు. మీరు ఎవరి మీద చర్యలు తీసుకున్నారో వారి గురించి మాట్లాడుతున్న వ్యక్తులు చాలా శక్తివంతులు. వాళ్లు ప్రభుత్వంలో, వ్యవస్థలో ఏళ్ల తరబడి ఉన్నారు. ఈరోజుకు కూడా వాళ్లు కొన్ని రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నారు. కానీ మీరు మీ పని మీదే దృష్టి ఉంచండని, అవినీతిపరులైన ఏ ఒక్కరినీ వదలకండి అని సీబీఐకి మోదీ దిశానిర్దేశర చేశారు. సీబీఐ వంటి సమర్థవంతమైన సంస్థలు, వృత్తినిపుణులు లేకుండా దేశం ముందుకు వెళ్లలేదని, బ్యాంకు మోసాల నుంచి వణ్యప్రాణుల సంబంధిత మోసాల వరకూ సీబీఐ పని అనేక రెట్లు పెరుగుతూనే ఉందని, అయితే అవినీతి రహిత భారతదేశాన్ని రూపొందించడమే సీబీఐ ప్రధాన బాధ్యత అని అన్నారు. పదేళ్ల క్రితం, ఎంత పెద్ద అవినీతి చేస్తే అంత గొప్ప అన్నంతగా పోటాపోటీ ఉండేదని, ఆ సమయంలో చాలా పెద్ద కుంభకోణాలు వెలుగు చూశాయని, అయితే వ్యవస్థ తమకు దన్నుగా ఉందనే కారణంగా నిందితులు భయపడేవారు కాదని మోదీ అన్నారు. 2014 తర్వాత తాము అవినీతి, నల్లధనం వెలికితీతపై యుద్ధప్రాతిపదికపై పనిచేశామని చెప్పారు. సీబీఐ అధికారులు సమర్థవంతంగా పనిచేయండి. ఎంతటి శక్తివంతులైన వ్యక్తులకైనా బెదరవలసిన పని లేదని మోదీ సూచించారు. ప్రజాస్వామ్యం, న్యాయానికి అవినీతి పెద్ద అవరోధమని, అవినీతి ముక్త భారతంలో సీబీఐ పాత్ర కీలకమని అన్నారు. అవినీతిపై పోరాటానికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, అవినీతిని సహించరాదనేది ప్రభుత్వం, ప్రజల కోరక అని ఆయన చెప్పారు. పేద ప్రజల హక్కులను అవినీతి ఊడలాక్కుంటుందని, అనేక మంది నేరగాళ్లుగా మారడానికి దారితీస్తుందని చెప్పారు. బ్లాక్ మనీ, బినామీ ఆస్తులపై తమ ప్రభుత్వం కొరడా ఝుళిపించిందని, అవినీతికి దారితీసే పరిస్థితులపైనా పోరాడుతోందని అన్నారు.

## 40 లక్షలకు ఏఈ పేపర్ అమ్మకానికి పెట్టిన రాజేశ్వర్

టిఎస్‌పిఎస్సీలో నిఘా కొరవడినట్లు గుర్తింపు

సిట్ విచారణలో కీలక అంశాలపై ఆధారాల సేకరణ

**హైదరాబాద్,ఏప్రిల్3(సమసమాజం):** టీఎస్‌పీఎస్సీ నిందితుల విచారణలో కీలక అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. ఏఈ పేపర్ లీక్‌లో కేతావత్ రాజేశ్వర్ కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. మూడు ఏఈ పేపర్లను రూ. 40 లక్షలకు రాజేశ్వర్ అమ్మినట్లు సమాచారం. రూ. 25 లక్షలు అడ్వాన్స్‌గా తీసుకున్న తర్వాత మిగతా డబ్బులు..పరీక్ష ఫలితాలు వచ్చిన తర్వాత ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నాడు. రాజేశ్వర్ దగ్గర నుంచి పోలీసులు రూ.8.5 లక్షలు రికవరీ చేశారు. ఇక రేణుకకి పేపర్ లీక్ చేసిన ప్రవీణ్.. నమ్మకమైన వారికే అమ్మాలని సూచించాడు. రూ.10 లక్షలకు రేణుకతో బేరం చేసుకున్నాక..అడ్వాన్స్‌గా రూ.5 లక్షలు ప్రవీణ్ తీసుకున్నాడు. ఈ విషయాన్ని సమీప బంధువు రాజేశ్వర్‌కి రేణుక భర్త డాఖ్యా నాయక్ చెప్పాడు. దీంతో మధ్యవర్తులు గోపాల్, నీలేష్, ప్రశాంత్, రాజేంద్ర కుమార్‌లకు రూ.40 లక్షలకు విక్రయించిన రాజేశ్వర్.. అడ్వాన్స్‌గా తీసుకున్న రూ.23 లక్షల్లో రూ.10 లక్షలు డాఖ్యా నాయక్‌కు ఇచ్చినట్లు తెలిసింది. కాగా, టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం మొత్తం ఆ కార్యాలయంలోని కాన్ఫిడెన్షియల్ సెక్షన్ చుట్టూనే తిరుగుతోంది. అత్యంత విశ్వసనీయంగా ఉండాల్సిన ఆ సెక్షన్‌లో నిఘా వైఫల్యం ఉన్నట్లు వెల్లడి కావడంతో.. సిట్ అధికారులు ప్రస్తుతం అదే కోణంలో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే కాన్ఫిడెన్షియల్ సెక్షన్ ఆఫీసర్ శంకరలక్ష్మిని 10 దఫాలుగా సుమారు 20 గంటలు విచారించారు. ప్రశ్నపత్రాల భద్రత, యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌ను నిందితుడు ప్రవీణ్ ఎలా తెలుసుకున్నాడు.. అనే విషయాలపై వివరాలు సేకరించారు. ఆ తర్వాత టీఎస్‌పీఎస్సీ సెక్రటరీ అనితా రామచంద్రన్‌ను విచారించారు. వారి నుంచి సేకరించిన సమాచారం ప్రకారం.. కాన్ఫిడెన్షియల్ సెక్షన్ భద్రత, పర్యవేక్షణలో చైర్మన్, సెక్రటరీ, సెక్షన్ ఆఫీసర్ మధ్య పూర్తిగా సమన్వయ లోపం ఉన్నట్లు సిట్ అధికారులు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలుస్తోంది. అదే అవకాశంగా భావించిన సెక్రటరీ పీఏ ప్రవీణ్, నెట్‌వర్క్ అడ్మిన్ రాజశేఖర్‌రెడ్డి ప్రశ్నపత్రాల లీకేజీ కుంభకోణానికి పాల్పడినట్లు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో కాన్ఫిడెన్షియల్ సెక్షన్‌పై పూర్తి బాధ్యత, అత్యున్నత అధికారాలు ఉన్న చైర్మన్ జనార్దన్‌రెడ్డి నుంచి ఇందుకు సంబంధించి వివరణ కోరడానికి సిట్ సిద్ధమైంది. ఆయన వెల్లడించే సమాచారం కీలకంగా మారనుంది. మొత్తం విచారణను పూర్తి చేసి రిపోర్టును సీల్డ్ కవర్‌లో ఈ నెల 11 వరకు న్యాయస్థానానికి అందజేయాల్సి ఉండటంతో సిట్ అధికారులు దూకుడు పెంచారు. టీఎస్‌పీఎస్సీ నిందితుల విచారణలో కీలక అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. ఏఈ పేపర్ లీక్‌లో కేతావత్ రాజేశ్వర్ కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. మూడు ఏఈ పేపర్లను రూ. 40 లక్షలకు రాజేశ్వర్ అమ్మినట్లు సమాచారం.

## కూల్‌రూఫ్ పాలసీతో తగ్గనున్న విద్యుత్ ఛార్జీలు

(మొదటి పేజీ తరువాయి) ఇంటితోపాటు, గోడలను కూల్‌రూఫ్ ఉంచుకుంటే విద్యుత్ వినియోగం కూడా తగ్గుతుందన్నారు. మొదట తమ ఇంటిపై కూల్ రూఫ్ విధానం అమలుచేశామన్నారు. హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్ సీడీఎంఏ ఆఫీస్‌లో కూల్‌రూఫ్ విధానంపై ఆయన మాట్లాడారు. భవన యజమానులు ఎండవేడిమిని తగ్గించుకొనేందుకు సహజ విధానాలు పాటించేలా రూపొందించిన తెలంగాణ కూల్‌రూఫ్ పాలసీ 2023–28ని మంత్రి కేటీఆర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. దేశం మొత్తంలోనే హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్‌కు డిమాండ్ ఉందని చెప్పారు. హైదరాబాద్‌లో ఉన్న అవకాశాలు దేశంలో ఎక్కడా లేవని స్పష్టం చేశారు. టీఎస్ బీపాస్‌తో దేశంలో ఎక్కడాలేని విధంగా భవన నిర్మాణ అనుమతులు ఇస్తున్నామని వెల్లడించారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా 240 కోట్ల మొక్కలు నాటి సంరక్షిస్తున్నామని చెప్పారు.ఈ ఏడాది హైదరాబాద్‌లో 5 చదరపు కిలోమీటర్ల కూల్ రూఫ్ అమలుచేస్తామని మంత్రి కేటీఆర్ అన్నారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లన్నిటిపై కూల్ రూఫ్ అమలు చేస్తామన్నారు. 2030 నాటికి రాష్ట్రంలో 200 చదరపు కిలోమీటర్ల కూల్ రూఫ్ టాప్ ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. 600 చదరపు గజాలు, అంతకంటే ఎక్కువ స్థలంలో కట్టే భవనాలకు కూల్ రూఫ్ ఏర్పాటును తప్పనిసరి చేస్తామని వెల్లడించారు. కూల్‌రూఫ్ వల్ల మీటరుకు రూ.300 మాత్రమే ఖర్చవుతుందని చెప్పారు. కూల్‌రూఫ్ పెయింట్ వేయడం వల్ల కరెంటు చార్జీలు ఆదా అవుతాయని చెప్పారు. ఇప్పటికే కట్టిన భవనాలపై కూడా కూల్‌రూఫ్ విధానం అమలుచేయొచ్చని వెల్లడించారు. ఈ పాలసీలో భాగంగా రాష్ట్రంలో కూల్‌రూఫ్‌ల ఏర్పాటుకు అవసరమైన ప్రోత్సాహం అందిస్తామని, అనుసరిం చేవారికి ప్రోత్సాహకాలు ఇస్తామని వెల్లడించారు. పాలసీలు, చట్టం చేయడం చాలా సులువని, కానీ వాటిని అమలు చేయడం చాలా కష్టంతో కూడుకున్న పని అన్నారు. విద్యుత్ వాహనాల వినియోగం పెరగాలనేది సీఎం కేసీఆర్ ఆశయమని తెలిపారు. భవన నిర్మాణ వ్యర్థాల రీసైక్లింగ్‌కు హైదరాబాద్‌లో రెండు ప్లాంట్‌లు ఏర్పాటుచేశామని మంత్రి కేటీఆర్ అన్నారు. నాలుగు ఓట్లు వస్తాయని కూల్ రూఫ్ పాలసీ విధానం తేవడం లేదని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. దేశంలో అత్యధిక ఆఫీస్ స్పెస్ హైదరాబాద్‌లోనే ఉందని.. మన హైదరాబాద్ స్టోరీ ఇప్పుడే మొదలైందని, టీఎస్ బి పాస్ విధానంతో ముందుకు వెళ్తున్నామన్నారు. దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం కూల్ రూఫ్ పాలసీ తెస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. 2030 నాటికి హైదరాబాద్‌లో 200 చదరపు కిలోమీటర్లు, మిగతా ఏరియాలో 100 చదరపు కిలోమీటర్లు కూల్ రూఫింగ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి కేటీఆర్ తెలిపారు. ప్రభుత్వం ఆదాయం కోసం ఈ పాలసీ తేవడం లేదన్నారు. త్వరలో మననగరం కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు. బిల్డింగ్ నిర్మాణ వ్యర్థాల రీయూజ్ చేయడానికి బిల్డర్లు సహకరించాలని కోరుతున్నానన్నారు. రాజకీయాల కోసం పాలసీ తేవడం లేదని.. భవిష్యత్ తరం కోసం రూఫ్ పాలసీ తెస్తున్నామని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

## టెన్త్ పేపర్ లీక్ లీకేజీలో ముగ్గురు సస్పెన్షన్

(మొదటి పేజీ తరువాయి)కాలేదంటూ వికారాబాద్ డీఈవో రేణుక దేవి ఖండించారు. పేపర్ లీకేజ్ వార్తలను పోలీసులు నిర్ధారించారు. స్కూల్ కు వెళ్లిన పోలీసులు బందెప్ప మొబైల్ నుంచి పేపర్ లీక్ అయినట్లు గుర్తించారు. మరోవైపు ఇదే విషయంపై కలెక్టర్ నారాయణ రెడ్డితో డీఈవో రేణుకా దేవి సమావేశమయ్యారు. ఇప్పటికే రాష్ట్రంలో తెలంగాణ స్టేట్ సర్వీస్ పబ్లిక్ సర్వీస్ నుంచి పేపర్లు లీకైన అంశంపై తీవ్ర దుమారం రేగుతోంది. ఈ సమయంలో టెన్త్ పేపర్లు కూడా బయటకు వచ్చాయన్న వార్త అందరినీ షాక్ గురి చేసింది. ఈ క్రమంలో ప్రభుత్వం ఎలా స్పందిస్తుందన్న అంశం ఉత్కంఠగా మారింది. వికారాబాద్ జిల్లా తాండూరులో పదవతరగతి ప్రశ్నాపత్రం లీక్ అయ్యిందన్న వార్త కలకలం రేపింది. పరీక్షకు ముందే వాట్సాప్ లో ప్రశ్నాపత్రం లీక్ అయిందన్న ఆరోపణలను వికారాబాద్ డీఈవో రేణుక దేవి ఖండించారు. ఎలాంటి పేపర్ లీక్ కాలేదని స్పష్టం చేశారు. ఎస్ఎస్ సీ 2023 ఎగ్జామ్స్ కు సంబంధించి అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని రేణుక దేవి తెలిపారు. మొబైల్ ఫోన్స్ పూర్తిగా నిషేధించామని, తాను 4 పరీక్షా కేంద్రాలు విజిట్ చేసి వచ్చానని చెప్పారు. కానీ ఎక్కడా ఎలాంటి రిమార్క్స్ గానీ, కంప్లైంట్స్ గానీ రాలేదన్నారు. తనకు పేపర్ లీకేజీపై ఎలాంటి సమాచారం రాలేదని, తన ఫోన్ కు కూడా ఎలాంటి పేపర్ రాలేదని స్పష్టం చేశారు. ఈ వివాదంపై ఇంటలిజెన్స్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టుగా సమాచారం. వికారాబాద్ కలెక్టరేట్లో డీఈవో, విద్యాశాఖ అధికారులు సమావేశం అయినట్టు తెలుస్తోంది. ఆ తర్వాత డీఈవో హుటాహుటిన కలెక్టరెట్ కు వెళ్లినట్టు సమాచారం. పరీక్షకు ముందే వాట్సాప్ గ్రూపుల్లో టెన్త్ క్లాస్ వార్షిక పరీక్షల ప్రశ్నాపత్రం చక్కర్లు కొట్టిందంటూ పలు వార్తలు వచ్చాయి. పదో తరగతి పరీక్షలు ఈ రోజు 9.30కు ప్రారంభం కాగా.. మొదటి పేపర్ తెలుగు ఉదయం 9:37కే వాట్సాప్ లో ప్రత్యక్షం అయిందంటూ కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## సూరత్ కోర్టులో రాహుల్‌కు దక్కని ఊరట

(మొదటి పేజీ తరువాయి)వెంటనే చర్యలకు దిగింది. కేరళలోని వయనాడ్ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాహుల్ గాంధీని సూరత్ కోర్ట్ ఆఫ్ చీఫ్ జుడీషియల్ మేజిస్ట్రేట్ దోషిగా తేల్చడంతో లోక్‌సభ సభ్యత్వం నుంచి అనర్హత వేటు పడింది. దోషిగా తేలిన 23 మార్చి 2023 నుంచి నుంచి అనర్హత వర్తిస్తుంది.కర్ణాటకలోని కోలార్‌లో 2019 ఏప్రిల్ 13న ఎన్నికల ప్రచారం సందర్భంగా రాహుల్‌గాంధీ 'మోదీ' అనే ఇంటిపేరు ఉన్నవారందరూ దొంగలే అంటూ మోదీ 'కమ్యూనిటీ'ని అవమానించారని బీజేపీ ఎమ్మెల్యే, గుజరాత్ మాజీ మంత్రి పూర్ణేశ్ మోదీ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. 2021 అక్టోబరులో రాహుల్‌గాంధీ ఈ కేసు విచారణ నిమిత్తం సూరత్ కోర్టుకు హాజరై వాంగ్మూలం ఇచ్చారు. రాహుల్ గాంధీ ఈ వ్యాఖ్యలను ప్రధాని మోదీని ఉద్దేశించి చేశారు కాబట్టి.. వేస్తే ప్రధానే దీనిపై కోర్టును ఆశ్రయించి ఉండాల్సిందని, పూర్ణేశ్ మోదీ కాదని రాహుల్ తరఫు న్యాయవాది వాదించారు. అలాగే.. మోదీ అనే 'కమ్యూనిటీ'యే లేదు కాబట్టి అసలు ఈ కేసు చెల్లదని కోర్టుకు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ అవినీతిని బయటపెట్టడం తప్పు.. రాహుల్ వ్యాఖ్యల వెనుక వేరే ఎలాంటి దురుద్దేశాలూ లేవని వెల్లడించారు. రాహుల్ తన వ్యాఖ్యలను ప్రధాని మోదీ, నీరవ్ మోదీ, విజయ్ మాల్యా, మేహుల్ చోక్సీ, అనిల్ అంబానీకి పరిమితం చేసుకుని ఉండాల్సింది. కానీ, ఆయన ఉద్దేశపూర్వకంగానే 'మోదీ' అనే ఇంటిపేరు కలిగి ఉన్న వ్యక్తులకు బాధకలిగించే వ్యాఖ్యలు చేశారు. క్రిమినల్ పరువునష్టానికి పాల్పడ్డారు' అని న్యాయమూర్తి వర్మ తన తీర్పులో పేర్కొన్నారు. తన వ్యాఖ్యల ప్రభావం ప్రజల్లో ఎంతగా ఉంటుందనే విషయం.. దాని ద్వారా ఏమేరకు ప్రయోజనాలు పొందగలననే విషయం కూడా ఆయనకు తెలుసని తీర్పులో వ్యాఖ్యానించారు. 2018లో రాహుల్ చేసిన 'చౌకీదార్ చోర్‌హై' వ్యాఖ్యల విషయంలో సుప్రీంకోర్టు చేసిన సూచనల గురించి.. అప్పట్లో రాహుల్ బేషరతు క్షమాపణలు చెప్పిన విషయాన్ని కూడా న్యాయమూర్తి ప్రస్తావించారు. రాహుల్ వ్యాఖ్యల వల్ల.. ఫిర్యాదిదారుకు ఎలాంటి బాధ, నష్టం కలగలేదని, రాహుల్ గతంలో ఎలాంటి కేసులోనూ దోషి కాదని.. కాబట్టి తేలికపాటి శిక్ష విధించాలని రాహుల్ న్యాయవాది చేసిన వ్యాఖ్యలతో కూడా న్యాయమూర్తి ఏకీభవించలేదు. కాగా.. తీర్పు వెలువడే సమయంలో నాడు రాహుల్ గాంధీ కోర్టుహాల్‌లోనే ఉన్నారు. రాహుల్ తాను చేసే ప్రకటనల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని సుప్రీంకోర్టు గతంలోనే సూచించింది. అయినప్పటికీ ఆయన ప్రవర్తనలో మార్పు లేదు. ఆయన సిట్టింగ్ పార్లమెంటు సభ్యుడు. ఒక ఎంపీగా.. ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్నప్పుడు తీవ్రమైన విషయం. ఎంపీల ప్రకటనలకు విస్తృత ప్రభావం ఉంటుంది. ఈ కోణంలో చూస్తే ఆయన చేసిన నేరం మరింత తీవ్రమైనది. దీనికి తక్కువ శిక్ష విధిస్తే.. ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు పంపినట్లవుతుందని కోర్టు వ్యాఖ్యానించింది. ఇవే వివాదాస్పద వ్యాఖ్యలపై సూరత్ కోర్ట్ తీర్పు నేపథ్యంలో ఢిల్లీలో ఆయన ప్రస్తుతం ఉంటోన్న ప్రభుత్వ బంగళాను ఖాళీ చేయాలని లోక్‌సభ హౌజింగ్ కమిటీ నోటీసులు జారీ చేసింది. ఏప్రిల్ 22లోగా ఆయన తన బంగళాను ఖాళీ చేయాల్సి ఉంటుందని నోటీసుల్లో పేర్కొన్నారు. 2014 నుంచి రాహుల్ ఢిల్లీ 12 తుగ్లక్ లేన్ లోని ప్రభుత్వ బంగ్లాలో ఉంటున్నారు.

## పేపర్ల లీకేజీ తేలకుండానే మళ్లీ పరీక్షలా

(మొదటి పేజీ తరువాయి) నోటీసులు ఇస్తుంటే.. వాటికి సమాధానాలు ఇవ్వకుండా ఎగ్జామ్స్ పెడుతామంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే జనార్ధన్ రెడ్డి చైర్మన్ పదవికి రాజీనామా చేయాలని, పేపర్ లీకేజీలో ఉన్న వారి పేర్లను అమరవీరుల స్థూపం వద్ద బయటపెట్టాలని డిమాండ్ చేశారు. వరంగల్ కాకతీయ యూనివర్శిటీలో నిరుద్యోగ భరోసా కార్యక్రమం చేపట్టిన విద్యార్థులను అరెస్ట్ చేయడం దారుణం అన్నారు . కేయూ విద్యార్థులు మీటింగ్ పెడితే కేసులు పెడుతారా..? అని ప్రశ్నించారు. విద్యార్థులను నిర్బంధించడం దారుణమన్నారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఒక్కరోజైనా సీఎం అడుగుపెట్టారా..? అని ప్రశ్నించారు. ఓట్ల కోసం తాను కేయూ రాలేదని వివరణ ఇచ్చారు. విద్యార్థి నాయకులను ఉగ్రవాదుల కంటే దారుణంగా అరెస్ట్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ తల్లిని కాపాడుకోవడం కోసం విద్యార్థులు మీటింగ్ పెట్టారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చెప్పారు. బయట సమస్యలు లేకుంటే ఇక్కడ నాన్ బోర్డర్లు ఉండరని చెప్పారు. ఇలాంటి సీఎం ఉంటే లీకులు కాకుంటే మరేం అవుతాయని సెటైర్ వేశారు. సర్వీస్ కమిషన్‌ను రద్దు చేయాలని రాష్ట్రపతికి లేఖ రాశానని చెప్పారు. కేసీఆర్ కు ఇప్పుడు ఉద్యోగాలు ఇవ్వడం ఇష్టం లేదన్నారు. లక్షకుపైగా ఉద్యోగాలు ఖాళీగా ఉంటే కేవలం 80 వేల ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేశారని చెప్పారు. రాత్రికి రాత్రి జనార్ధన్ రెడ్డిని చైర్మన్ చేయడం వెనుక ఉన్న మతలబు ఏంటని ప్రశ్నించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీకేజీ కేసును సీబీఐకి అప్పగించి సమగ్ర విచారణ జరపించాలని లేఖలో పేర్కొన్నారు. లీకేజీ వెనుక ముఖ్యమంత్రి కార్యాలయం పాత్ర ఏమిటో తేల్చాలని, ప్రస్తుత కమిషన్‌ను భర్తరఫ్ చేయాలని రాష్ట్రపతిని ప్రవీణ్ కుమార్ లేఖలో కోరారు.

## నేటినుంచి యథావిధిగా పరీక్షలు

పాఠశాల విద్యాశాఖ స్పష్టీకరణ

(మొదటి పేజీ తరువాయి) విద్యాశాఖ స్పందించింది. నేటి పదో తరగతి పరీక్ష వాయిదా పడలేదని పాఠశాల విద్యాశాఖ స్పష్టం చేసింది. విద్యార్థులు, తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపింది. మంగళవారం నుంచి ఈ నెల 13వ తేదీ వరకు అన్ని పరీక్షలు నిర్వహిస్తామని స్పష్టం చేసింది. ఇక తెలుగు ప్రశ్నాపత్రాన్ని వాట్సాప్ ద్వారా బయటకు పంపిన వ్యవహారంలో నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ప్రకటించారు. ప్రశ్నాపత్రాన్ని బయటకు పంపిన ఉపాధ్యాయుడు బందప్ప, మరో ఇన్విజిలేటర్ సమ్మప్ప, చీఫ్ సూపరింటెండెంట్ శివకుమార్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ గోపాల్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డికి ఆదేశాలు జారీ చేసినట్లు శ్రీ దేవసేన తెలిపారు.

## స్వమిత్వ పథకాలన్ని అమలు చేయండి

(మొదటి పేజీ తరువాయి) పూర్తయిన సందర్భ ంగా,రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకాన్ని అమలు చేయాలని 2022 జూలై 29న కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖకు సంబంధించిన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి లేఖను రాశారని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. ఈ విషయంలో ఎటువంటి ముందడుగూ పడకపోవడం దురదృష్టకరమని తెలిపారు. ఈ పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసినట్లయితే ధరణి పోర్టల్ నందు ఎదురవుతున్న సమస్యల నుంచి తెలంగాణ ప్రజలు బయటపడొచ్చన్నారు.

# వన్డే ప్రపంచకప్-2023 లోగో విడుదల

**12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కొత్త లోగో**




**న్యూఢిల్లీ, ఏప్రిల్3 (సమ సమాజం):** ఐసీసీ.. వన్డే ప్రపంచకప్-2023కు సంబంధించిన లోగోను విడుదల చేసింది. ఈ ప్రపంచకప్ కోసం ఈసారి భారత్ ఆతిథ్యం ఇవ్వబోతోంది. అక్టోబర్ 5 నుంచి నవంబర్ 19 వరకు వన్డే వరల్డ్ కప్ జరగనుంది. మన దేశంలో చివరిసారిగా 2011 వన్డే వరల్డ్ జరగగా.. అందులో టీమిండియా విశ్వవిజేతగా నిలిచింది. అయితే, టీమిండియా వరల్డ్ కప్ గెలిచి 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఐసీసీ కొత్త వరల్డ్ కప్ లోగోను విడుదల చేసింది. బ్లూ, పింక్ కలర్ డిజైన్స్ మధ్య వరల్డ్ కప్ ఉంచి కొత్త లోగోను ఆకర్షణీయంగా తయారుచేశారు. '2023 వన్డే ప్రపంచకప్‌కు ఇంకా ఆరు నెలల టైం మాత్రమే ఉంది. సొంతగడ్డపై వరల్డ్ కప్ ఆడాలన్నది ప్రతీ జట్టు, ఆటగాడి కల. మేమంతా ఈ టోర్నీ ఎప్పుడు మొదలవుతుందా అనే ఉత్సాహంతో ఉన్నా. టీమిండియా పూర్తి సామర్థ్యంతో ఆడితే ట్రోఫీని గెలిచే అవకాశం ఉంది' అని లోగో రిలీజ్ అయిన సందర్భంగా టీమిండియా కెప్టెన్ రోహిత్‌శర్మ అన్నాడు. 2011 వరల్డ్ కప్ ఫైనల్లో.. ధోని సారథ్యంలోని భారత్ జట్టు శ్రీలంకను ఓడించి చరిత్రాత్మక విజయం సాధించింది. ఆ మ్యాచ్ లో ధోనీ సిక్స్ కొట్టి గెలిపించిన క్షణాలు ఇంకా క్రికెట్ ప్రేమికుల కళ్లల్లో ఉన్నాయి. మరోసారి అలాంటి అనుభూతిని పొందడానికి భారత అభిమానులు సిద్ధంగా ఉన్నారు.



# వన్డే ప్రపంచ కప్ గెలిచి 12 ఏళ్లు

**ఆనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్న ధోనీ**

**న్యూఢిల్లీ,ఏప్రిల్3 (సమ సమాజం):** మహేంద్రసింగ్ ధోనీ సారథ్యంలోని భారత జట్టు వన్డే ప్రపంచకప్ (2011) గెలిచి 12 ఏళ్లు అయింది. ఫైనల్‌లో శ్రీలంకను చిత్తు చేసిన ధోనీ సేన ప్రపంచకప్‌ను సగర్వంగా ముద్దాడింది. తాజాగా, ఈ ప్రపంచకప్ గురించి ధోనీ ఓ కొత్త విషయాన్ని పంచుకున్నాడు. ఈ టోర్నీలో అంతగా ఫామ్‌లోని ఎంఎస్.., ÷నైల్లో అజేయంగా 91 పరుగులు చేసి భారత అభిమానుల 28 ఏళ్ల నిరీక్షణకు తెరదించాడు. తాజాగా,, ÷నైల్ మ్యాచ్‌కు సంబంధించి 'బెస్ట్ మెమరీని' ధోనీ వెల్లడించాడు. నువాన్ కులశేఖర బౌలింగులో కొట్టిన విన్నింగ్స్ సిక్స్ తనకు అత్యంత మధుర జ్ఞాపకమని చెప్పుకొచ్చాడు. విజయం సాధించడానికి ముందు 15-20 నిమిషాలు తనకు గొప్ప అనుభూతిని మిగిల్చాయన్నాడు. అప్పుడు తమకేమీ ఎక్కువ పరుగులు అవసరం లేదని, భాగస్వామ్యం కూడా బాగా కుదిరిందని ధోనీ గుర్తు చేసుకున్నాడు. స్టేడియంలో 'వందేమాతరం' కూడా మొదలైందని, మళ్లీ అలాంటి వాతావరణాన్ని తీసుకురావడం కష్టమని భావిస్తున్నానని ధోనీ చెప్పుకొచ్చాడు. అయితే స్టేడియం, అభిమానులు కనుక సహకరిస్తే ఈ ప్రపంచకప్ (2023)లో ఇలాంటి దృశ్యం చూడొచ్చని అన్నాడు. మీకు తెలుసా? దీనిని పునరావృతం చేయడం చాలా కష్టం. అయితే, పరిస్థితులు అప్పటిలానే (2011)లానే ఉండి, 40-50 వేల మంది, లేదంటే 60 వేల మంది ప్రేక్షకులు పాడుతుంటే అలాంటి వాతావరణాన్ని మళ్లీ తీసుకురావొచ్చు' అని ధోనీ చెప్పుకొచ్చాడు. ఆ మ్యాచ్‌లో తాము గెలుస్తామని, ట్రోఫీని ముద్దాడతామని తమకు తెలుసని అన్నాడు. ఈ గెలుపుతో ట్రోఫీని అందుకోవాలన్న ఇండియన్ లెజెండ్ సచిన్ టెండూల్కర్ కోరిక కూడా నెరవేరింది. ఆ క్షణం కోసం సచిన్ ఏకంగా రెండు దశాబ్దాలు వేచి చూశాడు. 28 ఏళ్ల తర్వాత ప్రపంచకప్ తిరిగి భారత్ సొంతం కావడంతో దేశం సంబరాల్లో మునిగిపోయింది.

# హాఫ్ సెంచరీల్లో కోహ్లీ రికార్డు



**బెంగళూరు,ఏప్రిల్3 (సమ సమాజం):** ఐపీఎల్ 2023లో భాగంగా ఆదివారం ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో కింగ్ విరాట్ కోహ్లీ తనదైన ఆటతో జట్టును గెలిపించాడు. అయితే ఈ మ్యాచ్‌తో విరాట్ కోహ్లీ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు.49 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సర్ల సాయంతో 82 పరుగులు చేసిన కోహ్లీ ఐపీఎల్‌లో 50 సార్లు 50 ప్లస్ స్కోర్ చేసిన తొలి ఇండియన్ క్రికెటర్ గా నిలిచాడు. కోహ్లీ కంటే ముందుగా ఈ లిస్టులో ఢిల్లీ క్యాపిటల్స్ ఓపెనర్ డేవిడ్ వార్నర్ 60 హాఫ్ సెంచరీలు చేసి టాప్‌లో ఉన్నాడు. పంజాబ్ కెప్టెన్ శిఖర్ ధావన్ 49 సార్లు హాఫ్ సెంచరీలతో మూడో స్థానంలో ఉన్నాడు. ప్రస్తుతం కోహ్లీ పేరు మీద ఐపీఎల్‌లో 45 హాఫ్ సెంచరీలు 5 సెంచరీలు ఉన్నాయి

# దుమ్మురేపుతున్న వయోకామ్18

**ఐపిఎల్‌లో 147కోట్ల వ్యూస్**



**ముంబై,ఏప్రిల్3 (సమ సమాజం):** ఇండియన్ ప్రీమియర్ లీగ్ ను అధికారికంగా ప్రసారం చేస్తున్న వయోకామ్18కు చెందిన జియో సినిమా ఈ వీకెండ్‌లో దుమ్ము దులిపేసింది. మూడు రోజుల్లో కలిపి ఏకంగా 147 కోట్ల వీడియో వ్యూస్ రాబట్టింది. గత సీజన్ (2022) డిజిటల్ వీక్షణలతో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. ఆ సీజన్‌ను డిస్నీ ప్లస్ హాట్‌స్టార్ ప్రసారం చేసింది. గత ఐపీఎల్ మొత్తం సీజన్‌లో వచ్చిన డిజిటల్ వీక్షణల కంటే జియో సినిమాలో తొలి వారాంతంలో వచ్చిన వ్యూస్ ఎక్కువని జియో సినిమా పేర్కొంది. అంతేకాదు, ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2022కి వచ్చిన వీక్షణల కంటే కూడా ఎక్కువని తెలిపింది. డిఫెండింగ్ చాంపియన్స్ గుజరాత్ టైటాన్స్-చెన్నై సూపర్ కింగ్స్ మధ్య మ్యాచ్‌తో ఈ సీజన్ ప్రారంభమైంది. ఆ మ్యాచ్‌కు ఏకంగా 1.6 కోట్లమంది వీక్షించారు. అలాగే, ఆ ఒక్క రోజులోనే ఏకంగా 2.5 కోట్ల యాప్‌లు డౌన్‌లోడ్ అయ్యాయి. వారాంతంలో మొత్తం కొత్త వీక్షకుల సంఖ్య 10 కోట్లకు చేరుకుంది. అలాగే తొలి వారంలో మొత్తంగా కొత్త యాప్ డౌన్‌లోడ్స్ 5 కోట్లు దాటాయి. అభిమానులు 4కే ఫీడ్, 12 భాషల్లో ఐపీఎల్ కవరేజీ, 16 ప్రత్యేక ఫీడ్‌లు, హైప్ మోడ్, మల్టీక్యామ్ సెటప్ వంటివాటిని ల్యాప్ చేసినట్టు జియో సినిమా వివరించింది. యాప్ మొదట్లో కొంత ఇబ్బంది పెట్టినప్పటికీ ఆ తర్వాత సమస్య తొలగిపోయింది. ప్రతీ యూజర్ ఒక్కో మ్యాచ్‌కు సగటున 57 నిమిషాలు చొప్పున వెచ్చిస్తున్నాడు. హాట్‌స్టార్‌లో గతేడాది తొలి వారంతంలో నమోదైన దానికంటే ఇది 60 శాతం ఎక్కువ. ఈ సందర్భంగా వయాకామ్ 18 స్పోర్ట్స్ సీఈవో అనిల్ జయరాజ్ మాట్లాడుతూ.. దేశాన్ని డిజిటల్ విప్లవం ఎలా ఊపేస్తోందో చెప్పేందుకు ఈ గణాంకాలు ఓ నిదర్శనమని అన్నారు. జియో సినిమా ఐపీఎల్ 2023ను ఉచితంగా ప్రత్యక్ష ప్రసారం చేస్తోంది. భోజ్‌పురి, పంజాబీ, ఒడియా, గుజరాత్ వంటివాటి భాషల్లో తొలిసారి ప్రసారం చేస్తుండగా, ఇంగ్లిష్, హిందీ, బెంగాలీ, తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ భాషల్లోనూ లైవ్ స్ట్రీమింగ్ చేస్తోంది. ఐపీఎల్ ఉచిత ప్రసారాల ద్వారా ఈ సీజన్‌లో జియో సినిమా 60 శాతానికి పైగా ఆదాయాన్ని ప్రకటన ద్వారా ఆర్జిస్తుందని అంచనా. మిగిలినవి టీవీకి వెళ్తాయి. వినియోగదారుల విభాగంలో 20కిపైగా బ్రాండ్స్ జియో సినిమాతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. వీటిలో డ్రీమ్ 11, జియో మార్ట్, ఫోన్ పే, అమెజాన్, ర్యాపిడో, రుపే, టియాగో ఈవీ, యాపీ ఫిజ్, ఈటీ మనీ, క్యాస్ట్రాల్, టీవీఎస్, ఒరియో, బింగో, స్టింగ్, అజియో, హయర్, లూయిస్ ఫిలిప్పి జీన్స్, అల్ట్రా టెక్ సిమెంట్, పుమా, కమలా పసంద్, కింగ్ ఫిషర్ పవర్ సోడా, జిందాల్ పాంథర్ టీఎంటీ రీబార్ వంటివి ఉన్నాయి.

## ఎక్కువ పరుగులు చేసిన బ్యాటర్



**సంజూ శాంసన్ అరుదైన రికార్డ్**

**హైదరాబాద్,ఏప్రిల్3 (సమ సమాజం):** సన్ రైజర్స్ హైదరాబాద్ తొలి మ్యాచ్ లో రాజస్థాన్ రాయల్స్ పై 72 పరుగుల తేడాతో చిత్తుగా ఓడిపోయిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్ లో రాజస్థాన్ టాప్ ఆర్డర్ బ్యాట్స్ మెన్ హాఫ్ సెంచరీలతో రెచ్చిపోయారు. దీంతో ఆర్ఆర్ 204 పరుగుల భారీ స్కోరు చేసింది. ఈ మ్యాచ్ లో కెప్టెన్ సంజూ శాంసన్ అరుదైన రికార్డ్ ను సొంతం చేసుకున్నాడు. ఐపీఎల్ లో ఒక జట్టుపై ఎక్కువ పరుగులు చేసిన బ్యాట్స్ మెన్‌గా సంజూ రికార్డ్ సృష్టించాడు. మ్యాచులో 55 పరుగుల చేసిన సంజూ.. సన్ రైజర్స్ జట్టుపై అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. ఓవరాల్‌గా సన్ రైజర్స్ పై 725 పరుగులు చేశారు. సంజూ తర్వాత ఎస్ఆర్ హెచ్ పై.. అత్యధిక పరుగులు చేసింది విరాట్ కోహ్లి 569, షేన్ వాట్సన్ 566, డివిలియర్స్ 540, అంబటి రాయుడు 540 తర్వాతి స్థానాల్లో ఉన్నారు.




# నయన్ కవలల పేర్లు వెల్లడి

**ఇవేం పేర్లని కొందరి పెదవి విరుపు**



సౌతిండియా టాప్ హీరోయిన్ నయన తార గతేడాది జూన్‌లో ప్రముఖ తమిళ దర్శకుడు విఘ్నేష్ శివన్ ని గ్రాండ్‌గా వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. అనంతరం సంవత్సరం తిరక్కుండానే సరోగసీ ద్వారా ఈ జంటకి కవల పిల్లలు పుట్టారు. అప్పటి నుంచి ఏదో ఓ రకంగా ఆ పిల్లలకి సంబంధించిన వార్తలు నెట్టింట హల్‌చల్ చేస్తుంటాయి. తాజాగా మరోసారి నయన్ పిల్లలకి సంబంధించిన ఓ క్రేజీ వీడియో ప్రస్తుతం నెట్టింట హల్‌చల్ చేస్తోంది. నయన్, విఘ్నేష్ జంటకి పిల్లలు పుట్టినప్పటి నుంచి వారి పేర్లపై చర్చ జరుగుతోంది. ఆ సమయంలో తన పిల్లల పేర్లు ఇవేనంటూ.. విఘ్నేష్ శివన్ సోషల్ మీడియాలో పోస్టుని షేర్ చేశాడు. అందులో వారి పేర్లు కేవలం ఉయిర్ , ఉలగ్ అనే పేరు పెట్టామని తెలిపాడు. అయితే.. పూర్తి పేర్లు ఏంటనేది మాత్రం చెప్పలేదు. తాజాగా వారి పూర్తి పేర్లను నయనతార స్వయంగా వెల్లడించింది. చెన్నైలో తాజాగా జరిగిన ఓ అవార్డుల ఫంక్షన్‌కి నయనతార, విఘ్నేష్ జంట హాజరయ్యింది. ఈ వేడుకలో నయనతార స్టేజ్‌పై ఉండగా.. తన పిల్లల పూర్తి పేర్లు ఏంటని హోస్ట్ అడిగాడు. దానికి సమాధానం చెబుతూ వారి పూర్తి పేర్లని ఆ వేడుకలో నయన్ రివీల్ చేసింది. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట హల్‌చల్ చేస్తోంది. అందులో నయన మాట్లాడుతూ.. 'నా మొదటి కుమారుడు పేరు ఉయిర్ రుద్రోనిల్ ఎన్ శివన్, నా రెండో కుమారుడి పేరే ఉలగ్ ధైవేగ్ ఎన్ శివన్' అని చెప్పుకొచ్చింది. ఆ పేర్లలో విఘ్నేష్‌తో పాటు తన పేరు వచ్చేలా పెట్టారు. దీంతో ఇద్దరి పేర్లు బావున్నాయని, అందులోనూ ఆ జంట తమ మార్క్ చూపించిందని కామెంట్లు చేస్తున్నారు. అయితే.. 'రుద్రోనిల్, ధైవేగ్ అంటే అర్థం ఏంటి'.. 'ఇవేం పేర్లు' అంటూ కొందరూ విమర్శలు సైతం చేస్తున్నారు.

# నాగచైతన్యతో శోభిత డేటింగ్

**సమంతను చూసి ఏడ్చేసానంటూ కామెంట్**



శోభిత ధూళిపాళ తెలుగు అమ్మాయి అయినా ముందు హిందీలో పరిచయం అయింది. ఆ తరువాత తెలుగు సినిమా 'గూఢచారి' లో చేసి తెలుగు ప్రేక్షకులకు బాగా చేరువయింది. అలాగే కొన్ని వెబ్ సిరీస్ లలో కూడా నటించి శోభిత అటు బుల్లి తెర మీద, ఇటు వెండి తెర మీదా కూడా బాగా పేరు తెచ్చుకుంది. 'గూఢచారి' తరువాత మళ్ళీ అడివి శేష్‌తోటే 'మేజర్'సినిమాలో కూడా చేసింది. వీటన్నిటికీ మించి శోభిత ఈమధ్య వార్తల్లో బాగా వైరల్ అయింది ఎందుకంటే సమంత మాజీ భర్త నాగ చైతన్యతో ఎక్కువగా కనిపించటం వలన, అలాగే నాగ చైతన్యతో డేటింగ్ లో ఉందని కూడా రూమర్లు వస్తున్నాయి. అందులో ఎంత నిజం ఎంత అబద్ధం ఉందొ వాళ్ళకే తెలియాలి. ఇదిలా ఉంటే, శోభిత ఈమధ్య సమంత ని ఆ డ్రెస్ లో ఆలా చూసి తట్టుకోలేక ఏడ్చేసాను అని పోస్ట్ పెట్టింది. కొన్ని రోజుల క్రితమే కదా నాగ చైతన్యతో వున్న ఫోటో వైరల్ అయింది, మళ్ళీ ఈ సమంత గోల ఏంటి అనుకుంటున్నారా? ఇక్కడ సమంత అంటే నాగ చైతన్య మాజీ భార్య కాదు, శోభిత ధూళిపాళ సిస్టర్. విశాఖపట్నంలో పుట్టి పెరిగిన శోభిత, విశాఖపట్నం తన సిస్టర్ వివాహానికి వెళ్ళింది. అక్కడ తన సిస్టర్ సమంతని పెళ్లి డ్రెస్‌లో చూసి భావోద్వేగానికి గురి అయి ఏడ్చేసాను అని పోస్ట్ పెట్టిందండి. అంతే ! అయితే మరి సిస్టర్ వివాహం అయిపొయింది, మరి శోభిత వివాహమే తరువాత అని నెటిజన్స్ అందరూ అంటున్నారు. వెబ్ సిరీస్ 'ది నైట్ మేనేజర్' లో శోభిత చాలా బోల్డ్ రోల్ వేసిందని అంటున్నారు. అందులో అనిల్ కపూర్ , ఆదిత్య రాయ్ కపూర్ వేశారు. ఇది ఇంగ్లీష్ వెబ్ సిరీస్ అదే టైటిల్ తో వచ్చిన దానికి హిందీలో రీమేక్ చేశారు. కానీ టైటిల్ అదే పెట్టారు.

# విజయ్ హలోఫ్రెండ్స్‌కు భారీ రెస్పాన్స్



తలపతి విజయ్ తమిళ నాట ఒక సూపర్ స్టార్. విజయ్ కి అభిమానులు ప్రపంచం నలుమూలల వున్నారు. విజయ్ సినిమా వస్తోంది అంటే చాలు, తమిళనాట, అలాగే అతని అభిమానులకు ప్రపంచం అంతటా ఒక పండగే. అలాంటి విజయ్ ఏమి చేసినా సంచలనమే. ఎందుకంటే విజయ్ ఈమధ్య సాంఘీక మాధ్యమం అయిన ఇన్ స్టా గ్రామ్ లోకి అడుగు పెట్టాడు. అయితే అతను మొదటి పోస్ట్ ఏమి పెద్దగా రాయలేదు, తన ఫోటో పెట్టి 'హలో ఫ్రెండ్స్' అని మాత్రమే పెట్టాడు. అంతే ఇంకా సునామీ సృష్టింపబడింది. విజయ్ అంటే మాటలా, మజాకా నా మరి. ఒక్క రోజులో ఎంతమంది ఫాలోయర్స్ వచ్చారో తెలుసా విజయ్ కి. ఆ సంఖ్య తెలిస్తే షాక్ అవుతారు మీరు. నాలుగు మిలియన్ ఫాలోయర్స్ అవును, అక్షరాలా అంతేముంది ఫాలోయర్స్ విజయ్ కి వచ్చారు. ఇది కూడా ఒక రికార్డ్ ఏమో మరి. కొంతమంది సెలబ్రిటీస్ ఏమి చేసినా అదొక రికార్డు మరి. అందులోకి విజయ్ లాంటి స్టార్ ఇలా సాంఘీక మాధ్యమం లోకి వచ్చాడు అంటే మాటలా మారి. దీనిని అతనికి అభిమానుల సంఖ్య ఎలా వున్నదీ అర్థం అవుతోంది కదా. అప్పుడెప్పుడో ప్రభాస్ కూడా ఇన్స్టాగ్రామ్ లో అడుగు పెట్టాడనే ఇలాగే అతనికి కూడా ఫాలోయర్స్ వచ్చారు కానీ, ఇంతలా మాత్రం కాదు. ప్రభాస్ కూడా అప్పట్లో ఏమి పెట్టలేదు, 'బాహుబలి' సినిమా లో ఒక స్టిల్ పెట్టాడు, తరువాత 'బాహుబలి 2'సినిమా రెండేళ్లు పూర్తి అయినా సందర్భంగా అందులోంచి ఒక స్టిల్ పెట్టాడు. అంతే ఇంకా అభిమానుల ఫాలోయింగ్ పెరిగింది అతనికి. కానీ విజయ్ లా మాత్రం ఒక్క రోజులో అంతమంది లేరు. కానీ విజయ్ ఫాలోయింగ్ చూస్తుంటే సునామీ గుర్తుకు వస్తోంది, షాక్ అవుతున్నారు పరిశ్రమలో అందరూ, విజయ్ పాపులారిటీ చూసి! ప్రస్తుతం విజయ్, దర్శకుడు లోకేష్ కనకరాజ్ తో ఒక సినిమా చేస్తున్నాడు. దీనికి ఇంకా టైటిల్ పెట్టలేదు కానీ దీన్ని తలపతి67అని పిలుస్తున్నారు. ఇందులో త్రిష కథానాయికగా నటిస్తోంది.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in